


## బాసర ట్రిపుల్ ఐటీలో 'అడ్మిషన్ల' దందా?

అవినీతిపై ఏసీబీ, ఈడీతో విచారణ జరపాలి - ఏబీవీపీ డిమాండ్


# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ శుక్రవారం | 13 మార్చి 2026 | ■ 12 పేజీలు


# సిలిం'డర్'..!

■ వాణిజ్య సిలిండర్ల సరఫరా నిలిపివేయడంతో హోటళ్లలో కష్టాలు ■ కట్టెల పొయ్యిలపై పరిమిత వంటకాలు.. కొన్నిచోట్ల మూసివేత


■ చాయ్ డబ్బాలకూ తప్పని తిప్పలు..స్టాక్ లేకపోవడంతో ఇక్కట్లు ■ బ్లాక్‌లో సబ్సిడీ సిలిండర్లు.. తనిఖీలు చేయని అధికారులు

■ బుకింగ్ వ్యవస్థ నిలిపివేత.. గతంలో కంటే డెలివరీ ఆలస్యం

■ కొన్ని ఏజెన్సీల పరిధిలో అర్జంటుగా కావాలంటే అదనంగా వసూళ్లు

■ ప్రభాత సమాచారం, ఆదిలాబాద్ ప్రతినిధి

'ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చింది' అన్నది ఒక సామెత.. ప్రస్తుత పరిస్థితికి ఈ సామెత సరిగ్గా సరిపోతుందని చెప్పవచ్చు. అమెరికా- ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావం సామాన్యులపై పడటం మెల్లిమెల్లిగా మొదలైంది. నిత్య జీవితంలో అత్యంత కీలకమైన పెట్రోల్, డీజిల్, గ్యాస్‌లలో సింహభాగం హర్మూజ్ జలసంధి నుంచే రావాల్సి ఉండగా.. అక్కడ నెలకొన్న పరిస్థితులతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ కొరత లేకపోయినప్పటికీ, గ్యాస్ కొరత ఏర్పడకుండా ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వాణిజ్య సిలిండర్ల సరఫరాను ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ ధరను కూడా రూ.60 పెంచింది. ఇప్పటికిప్పుడు గృహ అవసరాలకు గ్యాస్ కొరత లేదు కానీ, వాణిజ్య సిలిండర్లు, బ్లాక్ సబ్సిడీ సిలిండర్లు ఉపయోగించే హోటళ్లపై భారీ ప్రభావం పడింది. గతంలో భారీ వంటకాలకు కట్టెల పొయ్యిల బట్టీలనే వినియోగించేవారు. కానీ కాలక్రమంలో గ్యాస్ విరివిగా దొరకడం, అన్ లిమిటెడ్ డిషెష్ అందుబాటులోకి రావడంతో గ్యాస్ వినియోగం తప్పనిసరి అయ్యింది. ఇప్పుడు గ్యాస్‌పై ఆధారపడటం హోటళ్ల నిర్వాహకులకు శాపంగా మారిందని చెప్పవచ్చు. వాణిజ్య సిలిండర్ బుకింగ్‌ను నిలిపివేయడంతో వంటలు ఎలా చేయాలో తెలియని పరిస్థితులు ఉమ్మడి జిల్లాలో నెలకొన్నాయి. గ్యాస్ కొరతతో హైదరాబాద్‌లో ఇప్పటికే సోమవారం రెస్టారెంట్లకు సెలవు ప్రకటించారు.




గ్యాస్ ఏజెన్సీల చుట్టూ పరుగులు

హోటళ్లలో కష్టాలు!

10




## పిల్లలూ టిఫిన్ బాగుందా..!

■ విద్యార్థులతో కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ మాటముచ్చట

■ గిరిజన బాలికల క్రీడా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

■ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సిబ్బందికి ఆదేశం

పిల్లలు టిఫిన్ ఎలా ఉంది.! రోజు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా మీకు అంటూ జిల్లా కలెక్టర్ హరిత విద్యార్థు లను అప్యాయంగా అడిగారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలను ఉదయం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిసరాలను, వంటగది, సరుకుల నిల్వలతో పాటు తరగతి గదులను పరిశీలించారు. వంటశాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మెనూ పట్టికను పరిశీలించి మెనూలో పేర్కొన్న విధంగా రోజు అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కలెక్టర్ స్వయంగా అల్పాహారం వడ్డించి వారితో కలిసి అల్పాహారం స్వీకరించారు. క్రీడల్లో నైపుణ్యతను ప్రదర్శించి జిల్లాకు వన్నె తీసుకురావాలని, క్రీడలతో పాటు విద్యలో రాణించాలన్నారు.

### 99 రోజుల ప్రణాళికతో

## జిల్లా ప్రగతికి సరికొత్త బాట




■ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ■ ఆదిలాబాద్‌లో సర్పంచులు, కౌన్సిలర్లకు శిక్షణ సదస్సు

■ హాజరైన ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్ ■ మార్చి 6 నుంచి జూన్12 వరకు కార్యాచరణ

■ ఏప్రిల్ 2న గ్రామ, వార్డు సభల నిర్వహణకు ఆదేశం ■ పారిశుద్ధ్యం నుంచి మహిళా సాధికారత వరకు



పెళ్లి వాహనం బోల్తా

## ఇద్దరు దుర్మరణం

నిర్మల్ మండలంలోని ఎల్లంపల్లి శివారులో జాతీయ రహదారిపై పెళ్లి వాహనం బోల్తా పడి, ఇద్దరు దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం సోంపూర్ గ్రామానికి చెందిన 21 మంది మినీ వ్యాన్‌లో ఆర్మూర్‌కు పెళ్లి కోసం వెళ్తున్నారు. వాహనం టైరు పేలిపోవడంతో అదుపుతప్పి బోల్తా పడింది. భరోడే లక్ష్మణ్ (60), తులసి దాస్ (38) ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు.

## ఈనెల 16 నుంచి ఒంటి పూట బడి




### చదివించి 'సబ్ ఇన్‌స్పెక్టర్'ను చేస్తే..

## చావే బహుమతిగా ఇచ్చింది!

■ భార్య చదువు కోసం రూ.లక్షలు ఖర్చు చేసిన భర్త

■ చివరకు నేరేడ్‌మెట్ ఇంట్లో బలవన్మరణం

■ ఎక్సైజ్ సీఐగా పదోన్నతి పొందాక భర్తకు దూరం

■ వరకట్నం కేసుతో మనస్తాపం చెంది ఆత్మహత్య?

■ భార్యే కారణమంటున్న శ్రీనివాస్ కుటుంబ సభ్యులు















# 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'తోనే ఊరూరా అభివృద్ధి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
- అట్టహాసంగా ప్రజాప్రతినిధుల అవగాహన సదస్సు
- జ్యోతి ప్రజ్వలన చేసిన కలెక్టర్, ఎమ్మెల్యేలు
- 99 రోజుల ప్రణాళికతో పారిశుద్ధ్యం, వైద్యంపై ఫోకస్
- ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రజాప్రతినిధులకు పిలుపు
- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే క్షేత్రస్థాయిలో సత్ఫలితాలు

**నిర్మల్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

"ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని అమలుచేసి గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రగతిని సాధిద్దామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం, నిర్మల్ పట్టణంలోని తిరుమల గార్డెన్స్ లో, ఇటీవలి ఎన్నికైన గ్రామ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పవార్ రామారావు పటేల్, వెడ్మ బొజ్జు పటేల్ లతో కలిసి పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి, తెలంగాణ రాష్ట్ర గీతం ఆలాపన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు చిన్నారులచే ప్రదర్శింపబడిన సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వీరికి కలెక్టర్, ఎమ్మెల్యే లు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలు, కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరాలనే ఉద్దేశంతో 99 రోజుల ప్రత్యేక ప్రణాళికను ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ప్రత్యేక ప్రణాళికలో భాగంగా జిల్లాలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజల్లో ఉన్న అనారోగ్య సమస్యలను తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజా ప్రతినిధులందరికీ పంచాయతీరాజ్ మున్సిపల్ చట్టాలపై అవగాహన ఉండాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

**ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలి**
**నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

ప్రజా ప్రతినిధులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రజా ప్రతినిధులుగా ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం గొప్ప విషయం అని, నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు అంతా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, పరిష్కరించే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి కృషి చేయాలని. అధికారులు పెండింగ్లో ఉన్న పైల్స్ అన్నింటిని 99 రోజుల ప్రణాళికలో భాగంగా పుష్కరించాలని తెలిపారు.

**అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి**
**ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**

ప్రజా సంక్షేమానికై, అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ అన్నారు. ఇటీవలి స్థానిక సంస్థల్లో ఎన్నికైన వారిలో ఎక్కువ శాతం యువత ఉన్నారని. వీరంతా ఉత్సాహంగా ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ పథకాల అమలులో కృషి చేయాలని ఆయన తెలిపారు.

**గ్రామాల అభివృద్ధిలో సర్పంచులదే ముఖ్యపాత్ర**
**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధిలో సర్పంచులదే కీలకపాత్ర అని తెలిపారు. ప్రజా ప్రతినిధులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధానకర్తనులుగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు గ్రామసభలు నిర్వహిస్తూ, గ్రామంలోని సమస్యలను తెరుసుకొని పరిష్కరించాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులకు ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ద్వారా, వారికి పరిపాలన జ్ఞానం పెరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాకు నిధులు తీసుకురావడంలో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పెంబి ఆస్పిరేషన్ బ్లాక్ ను అభివృద్ధి పథంలో నడిపిన ప్రజాప్రతినిధులను, సన్మానించి అభినందించారు. అధికారులు ప్రజల విలువైన భాగస్వామ్యంతోనే పెంబి ఆస్పిరేషన్ నుంచి నుంచి ఇన్స్పిరేషన్ వైపు పయనించిందని కొనియాడారు. రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలలో అద్భుత ప్రగతి కనబరిచి పథకాలు సాధించిన క్రీడాకారులకు జ్ఞాపికలు అందించి, సన్మానించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం శాఖల వారీగా సర్పంచులు ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, నిర్మల్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లు అప్పాల కావ్య, అప్పాల గణేష్ చక్రవర్తి, భైంసా మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ దత్తాత్రి, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మెన్ సయ్యద్ అర్జుమండ్ అలీ, డిఎల్ఎస్ఎ సెక్రటరీ రాధిక, సర్పంచ్ లు, మున్సిపల్ కౌన్సిలర్ లు, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని
# యువతిని మోసం చేసిన ఇద్దరు అరెస్ట్

**గుడిహత్నూర్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నిరుద్యోగ యువతిని మోసం చేసి డబ్బులు వసూలు చేసిన ఇద్దరు నిందితులను గుడిహత్నూర్ ఎస్ఐ ఎల్ శ్రీకాంత్ అరెస్ట్ చేసినట్లు తెలిపారు. గుడిహత్నూర్ మండలం సీతగొండి గ్రామానికి చెందిన ఓ యువతిని ఈ ఇద్దరు నిందితులు ఆదివాసీ నాయకుల పేరుతో, తమకు ఉన్న పరిచయాలతో, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. ఆత్రం గణపతి ఏ గుణవంత్ (53) రాజు, మావల గ్రామం, ఆదిలాబాద్ జిల్లా, సలాం వరుణ్ (27) ఏసలాం అరుణ్ కుమార్ ఆదివాసి స్టూడెంట్ యూనియన్ జిల్లా సెక్రటర్, రాంనగర్‌కు చెందిన ఇద్దరూ తమ పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి మొదట రూ.1,00,000/- డిమాండ్ చేశారు. బాధితురాలు పేద కుటుంబానికి చెందినదని చెప్పడంతో రూ.50,000/- ఇవ్వాలని ఒప్పించారు. ఈ క్రమంలో బాధితురాలు 2024 ఆగస్టు నెలలో రెండు విడతల్లో ఫోన్‌పే ద్వారా మొత్తం రూ.15,000/- నిందితులకు పంపింది. అనంతరం ఉద్యోగం ఇప్పించకుండా నిందితులు ఆమెను తప్పించుకుంటూ వచ్చారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినప్పుడు కూడా బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి కొంత నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు ఆదేశాల మేరకు వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌ఓ శ్రీకాంత్ తెలిపారు. ప్రజలు ముఖ్యంగా నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో డబ్బులు అడిగితే నమ్మవద్దని, సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

# పిల్లలు టిఫిన్ బాగుందా..!



**ఆసిఫాబాద్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

పిల్లలు టిఫిన్ ఎలా ఉంది.! రోజూ మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా మీకు అంటూ జిల్లా కలెక్టర్ హరిత విద్యార్థులను అప్యాయంగా అడిగారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలను ఉదయం ఆమె ఆకస్మికంగా సందర్శించి పాఠశాల పరిసరాలను, వంటగది, సరుకుల నిల్వలతో పాటు తరగతి గదులను పరిశీలించారు. వంటశాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మెనూ పట్టికను పరిశీలించి మెనూలో పేర్కొన్న విధంగా రోజూ అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కలెక్టర్ స్వయంగా అల్పాహారం వడ్డించి విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యతను ప్రదర్శించి జిల్లాకు వన్నె తీసుకురావాలన్నారు. క్రీడలతో పాటు విద్యలో రాణించాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు, సంక్షేమ గురుకుల పాఠశాలలో అనేక వసతులు కల్పించిందన్నారు. విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలను భారీగా పెంచిందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, ఉన్నత స్థానంలో ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు.

# 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో అధికారులు సమన్వయంతో పని చేయాలి



**నిర్మల్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా క్షేత్రస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో నిర్వహించిన అవగాహన సమావేశంలో శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, వెడ్మ బొజ్జు పటేల్, రామారావు పటేల్‌లతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు ప్రతి గడపకూ చేరాలని, అభివృద్ధి పనుల్లో ఎక్కడా జాప్యం జరగకూడదని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. అనంతరం, మండలాల వారీగా విచ్చేసిన సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లతో కలెక్టర్ విడివిడిగా భేటీ అయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, వారితో కలిసి సామూహిక చిత్రాలు దిగారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# జీవాలకు గాలికుంటు వ్యాధి టీకాలు

**కుభీర్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

కుభీర్ మండల వ్యాప్తంగా పశుసంవర్ధక శాఖ, పశు వైద్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మూగజీవాలకు గాలికుంటూ వ్యాధి టీకాల కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. కుబీర్, పల్సి పశు వైద్యాధికారులు విశ్వజిత్, ప్రకాష్ ఆధ్వర్యంలో నెలరోజులపాటు టీకాల కార్యక్రమం కొనసాగుతుందని పశువైద్యాధికారులు తెలిపారు. గురువారం మండలంలోని పార్డి (కె), శివుని పలుసు తాండ, రంజిని, రంజిని తాండ తదితర గ్రామాలలో పశువులకు టీకాలు వేశారు. గ్రామాలలో ఏ ఒక్క పశువు మిగలకుండా అన్ని పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించుకోవాలని రైతులకు సూచించారు. సర్పంచులు గంగమణి, సత్యనారాయణ, గోపాలమిత్రలు పవన్, జీవన్ పాల్గొన్నారు.

## పంచాయతీ భవనాన్ని
# ప్రారంభించిన ఎమ్మెల్యే

**జన్నారం, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలం చింతగూడలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని గురువారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ప్రారంభించారు ఈసందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు ఈకార్యక్రమంలో సర్పంచ్ సుతారి సుమలత వినయ్ కుమార్ కార్య దర్శి కళ్లెం రాజన్న వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.





చదివించి 'సబ్ ఇన్‌స్పెక్టర్'ను చేస్తే..

# చావే బహుమతిగా ఇచ్చింది!

- భార్య చదువు కోసం రూ.లక్షలు ఖర్చు చేసిన భర్త
- చివరకు నేరేడ్‌మెట్ ఇంట్లో బలవన్మరణం
- ఎక్సైజ్ సీఐగా పదోన్నతి పొందాక భర్తకు దూరం..
- వరకట్నం కేసుతో మనస్తాపం చెంది ఆత్మహత్య?
- తన చావుకు భార్యే కారణమంటున్న మృతుడు శ్రీనివాస్ కుటుంబ సభ్యుల ఆరోపణ

**రామకృష్ణాపూర్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణంలో విషాద ఘటన చోటుచేసుకుంది. పట్టణంలోని గణేష్‌నగర్‌కు చెందిన నాగెల్లి శ్రీనివాస్ (41) హైదరాబాద్ నేరేడ్‌మెట్‌లోని తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకోగా, ఆలస్యంగా స్వస్థలం రామకృష్ణాపూర్‌లో తెలిసి విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం రామకృష్ణాపూర్ ఆర్కే-4 గడ్డ ప్రాంతానికి చెందిన సట్ల జ్యోతితో శ్రీనివాస్‌కు 14 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. అప్పటికి డిగ్రీ పూర్తి చేసిన జ్యోతిని ఉన్నత చదువులు చదివించేందుకు శ్రీనివాస్ ఎంతో కృషి చేశాడు. హైదరాబాద్‌లోని గ్రూప్--2 కోచింగ్ సెంటర్‌లో ఆమెకు శిక్షణ ఇప్పించేందుకు సుమారు రూ.2 లక్షలు ఖర్చు చేశాడు. కోచింగ్ సమయంలో జ్యోతి గర్భిణి కావడంతో నార్మల్ డెలివరీ కోసం మరో రూ.2 లక్షలు ఖర్చు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

**జాబ్ వచ్చిన తర్వాత భర్తను దూరం పెట్టిందని ఆరోపణ...**

జ్యోతి గ్రూప్--2 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం పొందింది. నిర్మల్‌లో పోస్టింగ్ రావడంతో భర్తను దూరం పెట్టిందని, కాపురం చేయడానికి నిరాకరించిందని శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఇద్దరూ కలిసి ఉన్న రోజుల్లో కూడా తమను దగ్గరకు రానీయలేదని వారు వాపోయారు.

**భర్తకు తెలియకుండా రూ.4 లక్షలు అప్పు...**

ఇటీవల జ్యోతి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందింది. అనంతరం హైదరాబాద్ నేరేడ్‌మెట్‌లో సుమారు కోటి రూపాయల విలువైన ఇండిపెండెంట్ ఇల్లు కొనుగోలు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అందులో రూ.40 లక్షలు శ్రీనివాస్ ఇచ్చారని, మిగతా మొత్తాన్ని జ్యోతి లోన్ తీసుకుని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేసుకుందని పేర్కొన్నారు. ఇదే సమయంలో భర్తకు తెలియకుండా తోటి ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆనంద్‌కు రూ.4 లక్షలు అప్పుగా ఇచ్చినట్లు అగ్రిమెంట్ పత్రం దొరకడంతో గొడవలు జరిగినట్లు చెప్పారు.

**వరకట్న కేసు తర్వాత ఆత్మహత్య...**

ఈ నేపథ్యంలో జ్యోతి తన భర్త శ్రీనివాస్‌పై అదనపు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ కేసులో భాగంగా ఈ నెల 10న పోలీస్ స్టేషన్‌కు హాజరైన అనంతరం అవమానం భరించలేక ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని వారు పేర్కొన్నారు. అయితే ఇది నిజంగా ఆత్మహత్యేనా? లేక మరేదైనా అనుమానాస్పద పరిస్థితులున్నాయా అనే విషయంపై దర్యాప్తు చేయాలని శ్రీనివాస్ కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



## 108 అంబులెన్స్‌లో ప్రసవం

**ఇంద్రవెల్లి, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

ఇంద్రవెల్లి మండలం గట్టేపల్లి పంచాయతీ పరిధిలోని చిత్తగూడకు చెందిన సావిత్ర బాయి 108 అంబులెన్స్‌లో డెలివరీ అయింది. 108 అంబులెన్స్ పైలట్ రాజేష్, ఈఎంటి సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. చిత్త గూడకు చెందిన సావిత్రిబాయి గురువారం పురిటి నొప్పులతో బాధపడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. చిత్తాగూడ నుంచి అంబులెన్స్‌లో ఇంద్రవెల్లి పి.హెచ్.సికి తీసుకువచ్చిన తర్వాత సావిత్రి బాయికి రక్తహీనత ఉందని, రక్తం ఎక్కించవలసి ఉంటుందని వైద్యుల సూచనతో వెంటనే రిమ్స్‌కు తీసుకువెళ్తుండగా, పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ముత్తునూరు గ్రామ శివారులో అంబులెన్స్‌లోనే ప్రసవించిందన్నారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు.

## పల్లెల్లో ఆగని పల్లెవెలుగు బస్సులు

### ప్రయాణికులకు ఇబ్బందులు

**ఇంద్రవెల్లి, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

ఆయన మాట్లాడతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్వహిస్తున్న పల్లె వెలుగు బస్సులు గ్రామీణ ప్రజలకు ముఖ్యమైన రవాణా సౌకర్యంగా ఉన్నాయి అని అయితే ఇటీవల కొన్ని మార్గాల్లో పల్లెవెలుగు బస్సులు పల్లెల్లో ఆగకుండా నేరుగా వెళ్లిపోతున్నాయనే ఫిర్యాదులు పెరుగుతున్నాయి అని బస్సులపై "ఎక్స్‌ప్రెస్" బోర్డు పెట్టి డ్రైవర్లు, కండక్టర్లు కొన్ని గ్రామ స్టాప్‌లను దాటేస్తున్నారని ప్రయాణికులు చెబుతున్నారు.దీంతో పల్లెల్లో ఉన్న విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో బస్సులు ఆగకపోవడంతో ప్రజలు గంటల పాటు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గ్రామ ప్రజలు పలుమార్లు



అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యకు సరైన పరిష్కారం లభించలేదని చెబుతున్నారు. పల్లెవెలుగు బస్సులు గ్రామాల కోసం ఏర్పాటు చేసిన సేవలు కావడంతో అన్ని గ్రామ స్టాప్‌లలో తప్పనిసరిగా ఆగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



## జనగణన-2027 సమీక్ష

**ఆదిలాబాద్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

'హౌస్‌లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్' ప్రక్రియ పారదర్శకంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'జనగణన-2027'లో భాగంగా 'హౌస్‌లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్' ప్రక్రియపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హెచ్.ఎల్.బి క్రియేటర్ అప్లికేషన్ వినియోగం, పటాల తయారీ, సెల్ఫ్ ఎన్యూమరేషన్ వంటి కీలక అంశాలపై అధికారులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఎన్యూమరేషన్ బ్లాక్ పరిధిని స్పష్టంగా గుర్తించి, సరిహద్దులను నిర్ణయించడంలో హెచ్.ఎల్.బి క్రియేటర్ వెబ్ మ్యాపింగ్ అప్లికేషన్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వార్డుల విభజన, స్లమ్ ఏరియాల గుర్తింపు, జియో-ట్యాగింగ్ ప్రక్రియను నిశితంగా చేపట్టాలన్నారు. రెవెన్యూ గ్రామాలు, పట్టణ వార్డులే ప్రాథమిక యూనిట్లుగా ఈ గణన జరుగుతుందని స్పష్టం చేశారు. డిజిటల్ జనగణనలో భాగంగా ప్రవేశపెట్టిన 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' (స్వయం గణన) విధానంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇంటి యజమానులు తమ సమాచారాన్ని ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునేందుకు వీలుగా 15 రోజుల పాటు పోర్టల్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజలు నమోదు చేసిన సమాచారాన్ని ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ధృవీకరిస్తారని వివరించారు. ఈ ప్రక్రియ అంతా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఐటిడిఎ పీఓ యువరాజ్ మర్మాట్, కలెక్టరేట్ పర్యవేక్షకురాలు పంచాపూల, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

**జన్నారం, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 99రోజులు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

## తానూర్‌లో మెగా హెల్త్ క్యాంప్

**తానూర్; మార్చి 12 (ప్రభాత సమాచారం)**

తానూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 'ప్రజా పాలన'లో భాగంగా భారీ మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరానికి వివిధ గ్రామాల నుండి ప్రజలు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. భైంసా పట్టణానికి చెందిన నిపుణులైన డా. వనజ, డా.సుమల (జనరల్ ఫిజీషియన్), డా. శ్రీకాంత్ (ఎముకల నిపుణులు), మరియు డా. దయానంద్ (శిశు రోగ నిపుణులు) రోగులకు ప్రత్యేక వైద్య సేవలు అందించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



## వినియోగదారులు ఆన్‌లైన్‌లో మాత్రమే సిలిండర్ బుక్ చేసుకోవాలి

### మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రావు

**మంచిర్యాల, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

గ్యాస్ వినియోగదారులు ఆన్‌లైన్‌లో మాత్రమే సిలిండర్లను బుక్ చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఎల్‌పిజి డీలర్లతో అత్యవసర సమావేశం నిర్వహించి గ్యాస్ కంపెనీల సేల్స్ అధికారులతో ఫోన్ ద్వారా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో గృహ అవసరాల కోసం వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీలు, గోదాముల వద్దకు వెళ్లకుండా ఆన్ లైన్ లో మాత్రమే సిలిండర్లను బుక్ చేసుకోవాలని తెలిపారు. గ్యాస్ బుకింగ్ సమయం సింగిల్ సిలిండర్ వారికి 25 రోజులు, డబుల్ సిలిండర్ వారికి 30 రోజుల వ్యవధి ఉంటుందని తెలిపారు. గ్యాస్ డెలివరీ చేసే సమయంలో వినియోగదారులు డెలివరీ బాయ్‌కు ఓటిపి చెప్పి సహకరించాలని, హోటల్, రెస్టారెంట్లలో వాణిజ్య సిలిండర్ మాత్రమే ఉపయోగించాలని, నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ సిలిండర్లు ఉపయోగించినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్యాస్ సిలిండర్ల విషయంలో ఎవరైనా కృత్రిమ కొరతను సృష్టించి, బ్లాక్ మార్కెట్ లో సిలిండర్లను విక్రయించాలని చూస్తే నిత్యవసరల సరుకుల చట్టం 1955 క్రింద కఠిన చర్యలు తీసుకోవడం



జరుగుతుందని తెలిపారు. ఎల్ పి జి వినియోగదారులు కెవై సి తప్పనిసరిగా చేసుకోవాలని, గ్యాస్ ఏజెన్సీ ల వద్ద, ఆన్ లైన్, గ్యాస్ కంపెనీ అధికారిక వెబ్సైట్, యాప్ లో, గ్యాస్ సిలిండర్ పంపిణీ సమయంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల వద్ద పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులు విద్యతో పాటు
# అన్ని రంగాలలో రాణించాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**లక్షెట్టిపేట, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

విద్యార్థులు విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా రంగంలో రాణించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో గల ఆర్.కె.పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథి కొక్కిరాల సురేఖ తో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో, క్రీడా రంగంలో రాణించాలన్నారు. ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని పట్టుదలతో సాధించాలని, ఎంచుకున్న ప్రతి రంగంలో ప్రతిభ కనబరచాలని తెలిపారు. విద్య భవిష్యత్తుకు బలమైన పునాది అని, ఏ రంగంలోనైనా రాణించడానికి విద్య ఖచ్చితంగా అవసరమని, తెలిపారు. క్రమశిక్షణ, కృషి ఉంటే విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని, పాఠశాలలు విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికితీసే వేదికలుగా నిలవాలని తెలిపారు. విద్యార్థులు గురువుల మార్గదర్శకత్వంలో లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను అతిథులు ఆసక్తిగా వీక్షించి అభినందించారు.




## బీఆర్టీయూ జిల్లా
# అధ్యక్షుడిగా హబీబ్ పాషా

**తాండూర్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్టీయూ) మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా తాండూర్ మండలానికి చెందిన ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎండీ హబీబ్ పాషా నియామకమయ్యారు. బుధవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్టీయూ కార్మిక విభాగ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, ఆటోయూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య, రాష్ట్ర కార్యదర్శి నిలరాపు రవి, రేణిగుంట సురేష్ ఆధ్వర్యంలో ఎండీ హబీబ్ పాషాను మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రం అందజేసారు. ఈ సందర్భంగా హబీబ్ పాషా రాష్ట్ర నాయకులు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం కష్టపడుతూ భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

# వృద్ధురాలి మృతదేహం లభ్యం

**నిర్మల్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణంలో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. పట్టణ సీఐ నైలు తెలిపిన వివరాల ప్రకారం, మృతురాలి వయసు 60-65 ఏళ్లు ఉండొచ్చు. ఆమె ఎడమ చేతిపై త్రిశూలం పచ్చబొట్టు, బ్లూ బ్రౌన్ చీర, పర్పుల్ బ్లౌజ్ ధరించి ఉంది. మృతురాలి గురించి తెలిసినవారు సీఐ మొబైల్ నంబర్లు 8712659511, 8712581014 లకు సమాచారం అందించాలని కోరారు.

# చెరువులో ఎడ్ల బండి బోల్తాపడి ఎద్దు మృతి

**తాండూర్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

ప్రమాదవశాత్తు చెరువులో ఎడ్ల బండి బోల్తాపడిన ఘటనలో ఎద్దు మృతి చెందగా, రైతు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన దాగం మల్లయ్య అనే రైతు గురువారం మధ్యాహ్నం తన చేను నుంచి ఎడ్ల బండితో శివారులోని పెద్ద చెరువుకు ఎద్దులకు నీళ్ళు తాగించేందుకు తీసుకెళ్ళాడు. అక్కడ గుంత లోతుగా ఉండడంతో ఒక్కసారిగా ఎడ్ల బండితో పాటు రైతు నీళ్లలో మునిగిపోయాడు. వెంటనే తేరుకున్న రైతు ఎడ్లబండిని వదిలి అతి కష్టం మీద నీళ్లలో ఈదుకుంటూ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనలో చెరువులో పడిన రెండు ఎద్దులలో ఒక ఎద్దు మృతి చెందగా, మరో ఎద్దు ప్రాణాలతో బయటపడింది. మృతి చెందిన ఎద్దు విలువ



రూ.70వేలు విలువ ఉంటుంది. రూ.30వేల విలువ గల ఎడ్ల బండి సుజ్జునుజ్జు అయ్యింది. రైతు దాగం మల్లయ్యకు రూ. 1లక్ష దాకా నష్టం వాటిల్లిం దని సంబంధిత అధికారులు స్పందించి, నష్టపరిహారం అందించాలని స్థానికులు కోరారు.

# ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ బడుల పటిష్టత

### ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ఆదిలాబాద్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

ప్రైవేట్ విద్యా వ్యవస్థకు దీటుగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్టపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది నిధులను వెచ్చిస్తోందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం భోరజ్ మండలంలోని బాలాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఈజీఎస్ నిధులతో చేపట్టే కిచెన్ షెడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యాభి వృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి పలు పథకాలను అమలు చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం సైతం విద్యా రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. ఇటీవల ఆదిలాబాద్ నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపమని, దీంతో జైనథ్ మండలం బెల్గాం గ్రామ సమీపంలో సుమారు రూ. 200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణం చేపట్టనుంది అని తెలిపారు. ఈ పాఠశాల ద్వారా సుమారు 3,500 మంది పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# యువత క్రీడల్లో రాణించాలి


**రెబ్బెన, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామంలో పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ మహేష్‌గౌడ్ తండ్రి స్వర్గీయ వెంకటిగౌడ్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను గురువారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమ శిక్షణను, క్రీడా స్పూర్తిని పెంపొంది స్తాయన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడుతాయని తెలిపారు. యువత క్రీడలపై దృష్టి సారించాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల యువత ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా వారిలో ప్రతిభ వెలికి తీసే అవకాశం ఉంటుందని చెప్పారు. క్రీడలతో ఇతర ప్రాంతాల వారితో స్నేహ సంబంధాలు పెరుగాయని అన్నారు. పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొ నాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ భరద్వాజ్, ఉప సర్పంచ్ వరలక్ష్మి, దుర్గారావు, నాయకులు సంజీవ్, మధునయ్య, తిరుపతి, బి.తిరుపతి, పోచమల్లు, శ్రీధర్, శ్రీను, ప్రభాకర్, ఆనంద్, వినోద్, జేశ్వాల్, శంకరమ్మ, పద్మ, ఉబెదుల్లా, సాయి, పద్మ పాల్గొన్నారు.

## ఉత్తమ గాయనిగా
# లింగంపల్లి శ్రావణికి అవార్డు

**దండేపల్లి, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

దండేపల్లి మండల కేంద్రంలోని"పద్మశాలి భవనం"ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాలలో నిష్ణాతులైన వారికీ అవార్డ్స్ అందించడం జరిగింది. కార్యక్రమంలో గత 15 సంవత్సరాలనుండి అలాగే తెలంగాణ మలిదశ ఉద్యమంలో ధూందాం" కళాకారిణిగా మొదలుకొని ఇప్పుడు కూడా తన ఆటా-పాటల ద్వారా వివిధ ప్రభుత్వ-ప్రైవేట్ శాఖలో కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉత్తమ గాయనిగా లింగంపల్లి శ్రావణికి అవార్డు అందిచారు. కొల్లూరి రవికుమార్ నిర్వహించిన కార్యక్రమంలో ఆల్ ఇండియా జాతీయ అధ్యక్షురాలు బండ శంకరి ఉపాధ్యక్షులు మామిడిపెల్లి బానయ్య, లక్ష్మీనారాయణ, రాజలింగు పాల్గొన్నారు.



# యువ ఆవిష్కర్తలకు ప్రోత్సాహం

### ఆదిలాబాద్‌లో 'ఇన్నోవేషన్ పంచాయత్' నిర్వహణ
### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని యువ ఆవిష్కర్తలు, విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల వినూత్న ఆలోచనలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు పనిచేస్తున్న తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన శనివారం కలెకట్రేట్‌లోని సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు 'ఇన్నోవేషన్ పంచాయత్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన యువత, విద్యార్థులు, ఆవిష్కర్తలు తమ వినూత్న ఆలోచనలను నిపుణుల ముందుంచి మార్గదర్శకత్వం పొందే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర రాజధానికి దూరంగా ఉన్న జిల్లాలలో కూడా ప్రతిభావంతులైన యువతకు సమాన అవకాశాలు



కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్థానిక సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలను సూచించే ఆలోచనలు ఉన్న వారు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆవిష్కరణలను వెలికితీయడంలో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారికి రాష్ట్ర స్థాయి నిపుణుల నుండి ప్రత్యక్ష మార్గదర్శనం లభిస్తుందని తెలిపారు. తమ ఆలోచనల ఆచరణ సాధ్యతపై నిపుణుల ద్వారా ఐడియా వ్యాలిడేషన్ పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే ప్రోటోటైప్ తయారీ, స్టార్టప్ అభివృద్ధి, వ్యాపార విస్తరణకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక మార్గదర్శనం అందిస్తారని వివరించారు. ప్రభుత్వ పథకాలు, ఇంక్యుబేషన్ సెంటర్లు, స్టార్టప్ మద్దతు వ్యవస్థలతో అనుసంధానం చేసే అవకాశమూ కల్పిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు పోస్టర్‌లో ఇచ్చిన కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా లేదా అధికారిక వెబ్‌సైట్‌లో ముందస్తుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ముందుగా నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని యువత, విద్యార్థులు, ఆవిష్కర్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ వినూత్న ఆలోచనలను వాస్తవ రూపంలోకి తీసుకురావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.






## 'ప్రజా పాలన' విజయవంతం కావాలంటే
# ప్రజాప్రతినిధుల పాత్రే కీలకం

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- 99 రోజుల ప్రగతి ప్రణాళికపై సర్పంచులు, కౌన్సిలర్లకు జిల్లాస్థాయి శిక్షణ సదస్సు
- విధివిధానాలు, అధికారాలపై అవగాహన ఉండాలి
- క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలి
- 'అమ్మ ఆదర్శ పాఠశాలల'లోవసతులు కల్పించాలి
- ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి

**మంచిర్యాల, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలులో ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకమైనదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో గల అమ్మ గార్డెన్స్ లో గ్రామపంచాయతీ సర్పంచ్ లు, మున్సిపల్ కార్పొరేషన్/మున్సిపాలిటీ మేయర్/చైర్ పర్సన్ లు, డిప్యూటీ మేయర్/ వైస్ చైర్ పర్సన్ లు, కార్పొరేటర్లు/ కౌన్సిలర్లకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి డి సి పి ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించి ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం జరిగిందని, ఈ క్రమంలో విధులు, అధికారాలపై గ్రామపంచాయతీల సర్పంచ్లకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని, పంచాయితీ రాజ్ చట్టాలు వివరించడం జరిగిందని తెలిపారు. మార్చి 6 నుంచి జూన్ 12వ తేదీ వరకు 99 రోజుల పాటు ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. గ్రామ,



మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి లలో కార్యచరణ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పారిశుధ్యం, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్ తదితర అంశాలపై కార్యాచరణ, సమాజ హిత అంశాలపై ప్రణాళికలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అమలు చేయడంలో ప్రజా ప్రతినిధులు తీసుకోవలసిన చర్యల గురించి తెలుసుకోవాలని తెలిపారు. తెలంగాణ పంచాయతీరాజ్ & మున్సిపల్ యాక్ట్ ల గురించి ప్రజాప్రతినిధులకు సంక్షిప్తంగా వివరించడం జరుగుతుందని తెలిపారు. విద్యా రంగ అభివృద్ధి దిశగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యార్థం మౌలిక వసతులు, విద్యుత్, త్రాగునీరు, మూత్రశాలలు, ప్రహరీ గోడ నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టడం జరిగిందని,



ఇందులో భాగంగా ఉపాధి హామీ క్రింద పనులు చేయడం జరిగిందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలను అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ అభివృద్ధి పనులలో భాగస్వామ్యులను చేయడం జరిగిందని తెలిపారు. రేషన్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్నట్లయితే క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో నెలకొన్న సామాజిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. నిరుద్యోగ యువత భవిష్యత్తు దృష్ట్యా మాదకద్రవ్యాల నిరోధకం, మద్యం వినియోగంపై ప్రజా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 2, 3 వార్డులలో 3, 4 రోజుల పాటు పారిశుధ్యం, త్రాగునీటి పైప్ లైన్ల మరమ్మత్తు, ఇతర పనులు చేపట్టడం జరుగుతుందని, ప్రజా ప్రతినిధులు కార్యక్రమాలలో పాల్గొని ప్రజలను భాగస్వామ్యులను చేయాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ నిరంతరాయంగా కొనసాగించాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలలో ఒకసారి లబ్ధి పొందిన వారిని గుర్తించాలని, మరల లబ్ధిదారుల జాబితాలో వారి వివరాలు లేకుండా జాగ్రత్త వహించాలని, తద్వారా అర్హత గల మిగిలిన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుందని, ప్రభుత్వ లక్ష్యాలు విజయవంతం అవుతాయని తెలిపారు. రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి ఒక్కరు రహదారి భద్రత నియమాలను పాటించే విధంగా ప్రజాప్రతినిధులు వారి పరిధిలో అవగాహన కల్పించాలని తెలిపారు. మున్సిపల్ పాలకవర్గం ఏర్పాటు చేయబడినందున మున్సిపల్ అభివృద్ధి కొరకు నిధులు మంజూరు అవుతాయని, ఈ నిధులను సక్రమంగా వినియోగిస్తూ ప్రజా ప్రయోజనకర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. వేసవిలో ప్రజలకు నిరంతరం నీటిని సరఫరా చేసే విధంగా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు తమ పరిధిలో పకడ్బందీగా అమలు చేయాలని, నీటి వనరులను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. విద్యుత్ దీపాల ఏర్పాటులో సౌర విద్యుత్ దీపాల ఏర్పాటుపై దృష్టి సారించాలని, తద్వారా విద్యుత్ వినియోగాన్ని నియంత్రించవచ్చని తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలులో ప్రజా ప్రతినిధుల విధులు, అధికారాలు తెలుసుకొని ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్ధవంతంగా అమలు చేసి ప్రజాసంక్షేమం ఉందిగా కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం అమలులో ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని
# తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఆసిఫాబాద్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ గురుకుల పాఠశాల/కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని గురువారం జిల్లా కలెక్టర్ కె. హరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించిన ఆమె, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి మాల్ప్రాక్టీస్కు తావు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా పరీక్ష కేంద్రం వద్ద తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన బందోబస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఫిజిక్స్ ఫ్యాకల్టీ అధ్యాపకుడు సంజీవ్ రావుకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# భూ సమస్యలు పరిష్కరించాలి



### కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత

**ఆసిఫాబాద్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని భూ సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ కె.హరిత అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో బుధవారం సర్వే ల్యాండ్ రికార్డ్ శాఖ ఆధ్వర్యంలో రెండో విడత లైసెన్స్ సర్వేయర్లకు నిర్వహించిన 50 రోజుల శిక్షణ అనంతరం నిర్వహించిన పరీక్షలలో ఎంపికైన 53 మంది లైసెన్స్డ్ సర్వేయర్లకు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టంలో భాగంగా జరిగే విరాసత్ పార్టిషన్, కొనుగోలు వంటి పట్టా మార్పిడి ప్రక్రియలో లోకేషన్ మ్యాప్ జత చేయాల్సి ఉందన్నారు. ఎక్కడ కూడా పొరపాట్లకు తావు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టే భూ సర్వే ప్రక్రియలో మండల సర్వేయర్ సహాయకుడిగా పని చేయాల్సి ఉంటుందని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి సర్వేయర్లు కీలకమని తెలిపారు. కార్యక్రమంలో ల్యాండ్ సర్వే ఏడీఏ వినయ్, మండల సర్వేయర్లు, లైసెన్సుడ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# 6 వేల మంది విద్యార్థులకు పెన్నులు పంపిణీ



**ఆదిలాబాద్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి కీలకమని, పరీక్షల భయాన్ని వీడి సన్నద్ధం కావాలని ఆదిలాబాద్ మండల విద్యాధికారి సోమయ్య సూచించారు. జిల్లా ఆర్య వైశ్య మహాసభ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పెన్నుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అంతకు ముందు వాసవీమాత సన్నిధిలో పెన్నులకు పూజలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పెన్నులు పంపిణీ చేసి విద్యార్థులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ సభ్యులు పాల్గొన్నారు.



# చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

### ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్

**తిర్యాణి, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

తిర్యాణి మండలంలోని ఆశ్రమ హైస్కూల్లో గురువారం "పోలీసులు మీకోసం" కార్యక్రమంలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు ఏఎస్పీ చిత్తరంజన్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఆశ్రమ స్కూల్ విద్యార్థులకు వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ చిత్తరంజన్ మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. చదువు ద్వారానే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొంటూ విద్యార్థులను ప్రోత్సహించారు. పదవ తరగతి విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాలు సాధించవచ్చన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులు కూడా పట్టుదలతో ముందుకు సాగితే దేశానికి సేవ చేసే స్థాయికి ఎదగగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన సీఐ సంజయ్, తీర్యాని ఎస్ఐ వెంకటేష్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



### రంజాన్ సందర్భంగా

## ఆసిఫాబాద్‌లో ఇఫ్తార్ విందు

**ఆసిఫాబాద్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఆసిఫాబాద్ రోజ్ గార్డెన్'లో ముస్లిం సోదరులకు గురువారం అధికారికంగా ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ వేడుకలో జిల్లా కలెక్టర్ కె హరిత. ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఏఎస్పీ చిత్తరంజన్ పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి విందు స్వీకరించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మహిళలకు రంజాన్ (తోఫా)గిఫ్ట్‌ను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి అహ్మద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, అధికారులు, ప్రజాప్రతినిధులు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

### నర్సింగ్ అధికారిపై

## మాజీ కౌన్సిలర్ దాడి



**నిర్మల్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన నర్సింగ్ అధికారులు నిర్మల్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాజీ కౌన్సిలర్ అప్పల వంశీ, విధుల్లో ఉన్న నర్సింగ్ అధికారి అభిపై బెదిరింపులకు పాల్పడి, దాడి చేశారని ఆరోపించారు. భద్రతా సిబ్బంది జోక్యం చేసుకుని అభిని రక్షించినట్లు తెలిపారు. శాంతించమని కోరినా అప్పల వంశీ అదుపుతప్పి దూషించారని పేర్కొన్నారు. ఈ ఘటనపై తక్షణ చర్యలు తీసుకోవాలని నర్సింగ్ అధికారులు పోలీసులను కోరారు.

### పొన్కల్ పంచాయతీకి

## రెగ్యులర్ ఈఓను నియమించాలి

### 11వ వార్డ్ సభ్యుడు ముడుగు ప్రవీణ్

**జన్నారం, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

మండలంలోని పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీకి రెగ్యులర్ ఈవోను నియమించాలని పంచాయతీ 11వ వార్డు సభ్యుడు ముడుగు ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం ఏర్పాటుచేసిన పత్రిక విలేకరులతో వారు మాట్లాడుతూ, పొనకల్ పంచాయతీ ఈవో పోస్టు గత నాలుగు సంవత్సరాలుగా ఇంచార్జీ పాలనలోనే కొనసాగుతుందన్నారు. పొన్కల్ గ్రామ పంచాయతీలో సుమారు 10వేల మంది ప్రజలు ఉన్నట్లు వారి యెక్క ప్రయోజనం దృష్టిలో పెట్టుకొని సౌకర్యార్థం రెగ్యులర్ ఈఓను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.



# విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి

### జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

**భీమారం, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

పదో తరగతి విద్యార్థులు ఒత్తి డికి గురికాకుండా, భయపడకుండా పరీక్షలు రాయాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం భీమారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పరీక్షల ప్రాముఖ్యం, సంసిద్ధత, భయాన్ని అధిగమించే మార్గాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ విద్యార్థులు భయపడకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలన్నారు. సమయ పాలన, ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే మంచి మార్కులు



సాధించవచ్చన్నారు. ప్రశ్నలను జాగ్రత్తగా చదివిన తర్వాతనే జవాబులు రాయాలని సూచించారు. పరీక్షల వేళ ఒత్తిడికి గురి కావద్దని, మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. పరీక్షల సమయంలో సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని, విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. పరీక్షల సమయంలో ప్రశాంతంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, ఇతర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**జన్నారం, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని గురువారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ప్రారం భించారు ఈసందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు ఈకా ర్యక్రమంలో సర్పంచ్ సుమలత వినయ్ కుమార్ కార్య దర్శి రాజన్న వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి కృషి : మేయర్ ధర్ని మధూకర్



**మంచిర్యాల, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల నగరపాలక సంస్థలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మేయర్ ధర్ని మధూకర్ అన్నారు. గురువారం కార్పొరేషన కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సమావేశంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆమోదించామని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని సూచించారు. సమష్టిగా పనిచేసినప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. డివిజనలోని సమస్యలను తెలుసుకొని వాటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అన్వేష్, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి**
**లక్షెట్టిపేట మున్సిపల్ చైర్ పర్సన దొంత అంజలి**

ఎలాంటి తారతమ్యాలు లేకుండా ప్రతీ ఒక్కరు మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గం అధికారులు ముందుకు సాగాలని లక్షెట్టిపేట మున్సిపల్ చైర్‌పర్సన దొంత అంజలినర్సయ్య సూచించారు. గురువారం లక్షెట్టిపేట పురపాలక సంఘ కార్యాల యంలో ఏర్పాటు చేసిన మొదటి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ కౌన్సిలర్ రోజు వారి వార్డుల్లో తిరుగుతూ ప్రజాసమస్యలను తెలుసుకొని వాటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం ఊత్కూర్ చౌరస్తాలో ఉన్న వార సంత రోడ్డుకు ఆనుకుని ఉందని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని దాన్ని కాస్త వెనక్కి జరిపేందుకు అక్కడి కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. త్వరలో కరీంనగర్ చౌరస్తాలోని ఉన్నటువంటి మేకల మండిలకు వేలంపాటు నిర్వహిస్తామన్నారు. వీటితో పాటు లక్షెట్టిపేట పట్టణంలో చేపట్టబోతున్న రోడ్డు విస్తరణ పనులకు మున్సిపల్ అధికారులు మార్కింగ్ చేశారని, పనుల్లో వేగం పెంచాలని రోడ్డు విస్తరణ పనులకు అందరూ సహకరించాలని కోరారు. ఇటిక్యాలలో రోడ్డు విస్తరణ పనులపై 3వ వార్డు కౌన్సిలర్ పెట్టెం తిరుపతి చైర్‌పర్సనకు వినతిపత్రం అందజేశారు. స్థానిక ఊత్కూర్ చౌరస్తా నుండి పాత బస్టాండ్ వరకు 80ఫీట్ల రోడ్డు పనులు చేపడ్డటంతో వ్యాపారాలు దెబ్బతింటున్నాయని దాన్ని 70ఫీట్లకు కుందించాలని 14వ వార్డు కౌన్సిలర్ మైలారపు సుధాకర్ సమావేశంలో చైర్మన దృషికి తీసుకుపోయారు. పట్టణంలో చేపట్టనున్న పనులపై మున్సిపల్ మేనేజర్ ఎజెండాను వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, మున్సిపల్ మేనేజర్ కల్లెడ రాజశేఖర్, మున్సిపల్ వైస్ చైర్మన మోత్కూరి రాజేశ్వరి, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో అందరూ భాగస్వాములు కావాలి




**ఆదిలాబాద్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం స్థానిక రెవెన్యూ గార్డెన్‌లో సర్పంచ్లు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఐటిడిఏ పీఓ యువరాజ్ మర్మాట్‌తో కలిసి పాల్గొని పలు సూచనలు చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా. అనంతరం కలెక్టర్, పీఓ, మున్సిపల్ చైర్ పర్సన్‌లను సర్పంచ్‌లు, కౌన్సిలర్లు శాలువాలతో సన్మానించారు. మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, డిఆర్డీఓ రవీందర్, డిపిఓ రమేష్, అదనపు ఎస్పీ మౌనిక, సర్పంచ్ లు, మున్సిపల్ వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.



### పదో తరగతి పరీక్షల కోసం

## సెక్షన్ 163 అమలు

### కుమ్రంభీం జిల్లా ఎస్పీ నితికా పంత్

**ఆసిఫాబాద్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లాలోని 38 పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 163 అమలులో ఉంటుందని, ఐదుగురు లేదా అంత కంటే ఎక్కువ మంది గుమికూడటాన్ని నిషేధించినట్లు తెలిపారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని, పరీక్షా కేంద్రాల సమీపంలో రాళ్లు, ఆయుధాలు లేదా ప్రమాదకర వస్తువులు తీసుకురావడం నిషేధమని పేర్కొన్నారు.

### ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని

## తనిఖీ చేసిన డీఈసీ

### పరీక్షలను పద్బందీగా నిర్వహించాలని సూచన

**కుభీర్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రమైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం స్టేట్ అబ్జర్వర్ బృందం సభ్యులు ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని డిఇసి కన్వీనర్ జాదవ్ పరుశురాం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.పరీక్ష నిర్వహణ పరిశీలించిన బృందం నిబంధన ప్రకారం పరీక్షలు నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 138మంది విద్యార్థులకు గాను 134మంది విద్యార్థులు హాజరయ్యారని నలుగురు గైర్హాజరు అయినట్లు సి ఎస్ విజయ్ భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఓ నర్సయ్య అధికారులు తదితరులు ఉన్నారు.



■ తగ్గుతున్న భూసారం.. భవిష్యత్తు అంధకారం ■ నిర్జీవంగా మారుతున్న పంట భూములు, సహజత్వాన్ని కోల్పోతున్న పుడమి తల్లి
■ కలుషితమవుతున్న భూములు, కష్టంగా మారిన సాగు ■ నీటి కొరత, అధిక వినియోగం ■ అధిక రసాయనిక ఎరువుల వినియోగం

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి



# క్షీణిస్తున్న భూసారం
# క్షోభిస్తున్న భూమాత

**మనిషి అభివృద్ధి పేరిట ప్రకృతిని మితిమీరి వినియోగం చేస్తున్న కొద్దీ భూమి సహజ స్వరూపం మారిపోతోంది, వ్యవసాయానికి కీలకమైన భూసారం రోజురోజుకూ తగ్గిపోతోంది, ఒకప్పుడు ఎంతో సారవంతంగా, అన్నీ రకాల పంటలు పండించేందుకు వీలుగా ఉండే భూమి ఇప్పుడు నిస్సారంగా, పోషకాల లోపంతో తన సహజత్వాన్ని కోల్పోతుంది.** మన పూర్వీకులు ఎటువంటి ఎరువులు, పురుగులు మందులు వాడకుండానే అన్నీ రకాల పంటలను భూమిలోని సహజ పోషకాలు, సూక్ష్మ జీవుల సహాయంతోనే పండించే వారు, అలాంటి వారు ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా చాలా సంవత్సరాల పాటు సంతోషకరమైన జీవితాన్నీ గడిపేవారు, కానీ పెరుగుతున్న జనాభాకు తగినంత ఆహార లభ్యత కొరకు హరిత విప్లవం తరువాత, హైబ్రిడ్ వంగడాలు రావడం విరివిగా రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం పెరగడం వలన నేల ఆరోగ్య స్థితి పూర్తిగా దెబ్బతిన్నది, అలాగే నానాటికి సాగు విధానాలు పూర్తిగా మారిపోయి భూమిని నిస్సారంగా మారుస్తున్నాయి.

భూసారం అనేది మట్టిలో ఉండే పోషకాలు, ఖనిజ పదార్థాలు, సూక్ష్మజీవుల సమతుల్య సమూహం. ఇవి పంటల పెరుగుదలకు, భూమి జీవశక్తిని నిలిపి ఉంచేందుకు కీలకం. మట్టిలో నత్రజని, భాస్వరం, పొటాషియం, సేంద్రీయ పదార్థాలు, సూక్ష్మజీవులు ఉండటం వల్లనే పంటలు ఆరోగ్యంగా వుండడం అధిక దిగుబడులు సాధించడం జరుగుతోంది. భూమి సారం కోల్పోతే, పంటల పెరుగుదల మందగిస్తుంది, భవిష్యత్తులో ఆహార సంక్షోభం, పర్యావరణ అసమతుల్యత ఏర్పడే ప్రమాదం ఉంది.

**భూసారం క్షీణించడానికి గల ప్రధాన కారణాలు...**

వ్యవసాయంలో యాంత్రికరణ, పారిశ్రామికీకరణ ప్రారంభించినప్పటి నుండి, ప్రపంచమంతటా నేలలోని సేంద్రీయ పదార్థం గణనీయంగా తగ్గింది. ఏనేల అయినా వ్యవసాయానికి పనికొచ్చేదిగా ఉండాలంటే, అందులో కనీసం 3 నుండి 6% వరకు సేంద్రీయ పదార్థం ఉండాలి, కానీ ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో, ఇది 1% కంటే తక్కువగా ఉంది. భారతదేశంలోని 62% మట్టిలో సేంద్రీయ పదార్థం 0.5% కంటే తక్కువగా ఉంది.

**ఇది ఇలా ఎందుకు జరిగింది?**

మనం ఒక టన్ను పంట పండించాము అంటే, దానర్థం మనం నేల పైపొరలోని ఒక టన్ను మట్టిని తీసేశాము అని. మరి దాన్ని తిరిగి బర్తీ చేయడం ఎలా? పంట భూముల్లో జంతువులు, చెట్లు ఉన్నప్పుడు సహజంగానే అది తిరిగి భర్తీ అయ్యేది, ఎందుకంటే సేంద్రీయ సారాన్ని మట్టిలోకి తిరిగి చేర్చే ఏకైక మార్గం, చెట్ల నుండి వచ్చే పచ్చని చెత్త ఇంకా జంతువుల వ్యర్థాలు.

**అధిక రసాయనిక ఎరువుల వినియోగం...**

విరివిగా యూరియా, డీఏపీ, పొటాష్ వంటి రసాయన ఎరువుల వినియోగం వల్ల మట్టిలో సహజ పోషక విలువలు తగ్గిపోతాయి, దీర్ఘకాలంలో సూక్ష్మజీవులు నశించి, భూసారం క్షీణతకు లోనవు తుంది, అలాగే మితిమీరిన పురుగు మందులు, కలుపు మందుల వాడడం కూడా భూమిలోనే సూక్ష్మ జీవుల నాశనాకి కారణం అవుతుంది, ఇది జీవుల ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది.

**అతిగా సాగు చేయడం, పంట మార్పిడి చేయక పొవడం...**

భూమికి విశ్రాంతి లేకపోవడం, నిరంతరం సాగుచేయడం, ఒకటే రకం పంటను ఎక్కువ సాగుచేయడం వల్ల భూమిలొ పోషక విలువలు తగ్గడం, సూక్ష్మ జీవులు నశించడం వంటివి జరిగి భూసారం పూర్తిగా క్షీణించడం జరుగుతోంది.

**అటవీ వినాశనం...**

అడవులు మట్టిని కాపాడే సహజ రక్షక ప్రాకృతిక వ్యవస్థల



అడవులను నరికివేయడం వల్ల భూమి పై పొరల క్షీణత పెరిగి, వరదల సమయంలో భూమి కోతకు గురి అయి సహజ పోషకాలను భూమి కోల్పోతుంది.

**నీటి కొరత, అధిక నీటి వినియోగం...**

పొదుపుగా నీటిని వాడకపోతే, భూమి తేమ కోల్పోయి పీచుబారిపోతుంది, భూగర్భజలాలు తగ్గిపోతే పంటల పెరుగుదలపై తీవ్ర ప్రభావం పడుతుంది.

**పరిశ్రమల కాలుష్యం...**

రసాయనాలతో కలుషితమైన వ్యర్థాలు భూమిలో చేరడం వల్ల పండ్లలో, కూరగాయల్లో విషతత్వం పెరుగుతుంది,ఇది భూమిని సారరహితంగా, విషపూరితంగా మార్చేస్తుంది.

**భూసారం తగ్గడం వల్ల కలిగే దుష్ఫలితాలు..**

పంటల దిగుబడి తగ్గిపోవడం, భూమిలో సారం తగ్గితే, పంటలు ఎదుగుదల ఆశించినంతగా వుండదు, దిగుబడులు తగ్గుతాయి, ఆహార సంక్షోభం ఏర్పడే అవకాశం ఉంది.

**మానవ ఆరోగ్యంపై జీవుల మనుగడపై ప్రభావం...**

భారతదేశంలో పండించే కూరగాయల్లో పోషక విలువలు గత 25సంబీ లలో 30%పడిపోయాయి, ప్రపంచంలో చాలా చోట్ల వైద్యాలు మాంసాహారం నుంచి శాకాహారం వైపు మళ్లిస్తుంటే మన దేశంలో మాత్రం చాలా మంది శాకాహారం నుంచి మాంసాహారం వైపు ప్రోత్సహిస్తున్నారు దానికి కారణం, పంటల ద్వారా లభించే ఆహార పదార్థాలలో పోషకాలు లోపించడం, తద్వారా మనం తీసుకునే ఆహారంలో పోషక విలువలు వుండక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్థాయి, దీని ప్రభావంగా పోషకాహార లోపం, రక్తహీనత, రోగనిరోధక శక్తి తగ్గిపోవడం వంటివి జరుగుతాయి, 3సంబీ కంటే తక్కువ వయస్సు వున్న భారతీయ పిల్లల్లో 70%మంది రక్త హీనతతో ఉన్నారంటే పరిస్థితి ఎలా వుందో అర్థం చేసుకోవచ్చు. మట్టిలో జీవ ద్రవ్య పదార్థం గత 50ఏళ్లలో 80% తగ్గింది ఇది ఇలాగే కొనసాగితే ఈ శతాబ్దం చివరికల్లా భూమి పొరపై 80%పురుగుల, కీటకాలు నశించిపోతాయి , భూమిపై పురుగుల, సూక్ష్మజీవులు, కీటకాలు నశించన మరుక్షణం మనిషి మనుగడ కూడా ప్రశ్నార్థకంగా మారుతోంది ,భూమి మీద 80% జీవులు భూమిపై 39అంగుళాల మట్టిపై మాత్రమే జీవిస్తాయి ఇది భూమి మీద ఉన్న మట్టి సగటు లోతు, మట్టిలో సారం తగ్గేకొద్ది క్షిణత భయంకరంగా వుంటుందీ

**పర్యావరణ అసమతుల్యత...**

భూమి పోషకాలను కోల్పోతే, పొలాలు , చెట్లు ఎండిపోతాయి, భూమిపై పచ్చదనం క్షీణిస్తుంది,జీవ వైవిధ్యం దెబ్బ తింటుంది ఫలితంగా వాతావరణ మార్పులు వేగంగా జరిగి పర్యావరణ అసమతుల్యతలు ఏర్పడతాయి

**జీవ వైవిధ్యం నష్టం...**

భూమిలో ఉండే సూక్ష్మజీవులు, పురుగులు, కీటకాలు సమతుల్యత కోల్పోతాయి,ఇది వ్యవసాయ భవిష్యత్తుపై ప్రభావం చూపిస్తుంది. వరదలు, కరువులు వంటి వాటికి దారి తీస్తుంది. ఎక్కడైనా విపరీతమీ మైన వరదలు సంభవించినప్పుడు మూడు నెలలు తిరగక ముందే అక్కడ కరువు వస్తుంది , వర్షపు నీరే నీటికి ఆధారం, చెరువులు, కాల్వలు, నదులు, మొదలైనవి నీటి గమ్యస్థానలే కానీ నీటిని సృష్టించేవి కావు వర్షాలు పడినప్పుడు నీరు భూమి కింది పొరలలో చేరి భూగర్భ జలాలు పెంచే విధంగా వుండాలి కానీ భూమి పొరల్లో సారం లేక పూడిక వలన నీరు నేల పైనే ప్రవహించి వాటి గమ్య స్థానాలకు చేరుతుంది, నేలపై వున్న సారవంతమైనమట్టి అంతా కొట్టుకుపోయి నదులు, సముద్రాలలో చేరుతుంది, భూములు మైదానాలలా మారుతున్నాయి, పోషకాలు లేని భూమి నీటిని నిల్వ ఉంచలేకపోతుంది, దీని వల్ల నీటి కొరత మరింత తీవ్రమవుతుంది.

**భూసారాన్ని పెంచే కొన్ని మార్గాలు...**

సేంద్రియ వ్యవసాయం, రసాయనాలను తగ్గించి జీవన ఎరువులు(ట్రైకోడర్మ, మైకొ రైజా, సుడోమొనాస్, అజటొబాక్టర్ వంటివి) సేంద్రీయ ఎరువులు, పచ్చి రొట్టె ఎరువులు(గోమూత్రం, కంపోస్ట్, వర్మీ కంపోస్ట్, పిల్లిపేసర, జనుము వంటివీ) వాడడం ద్వారా భూమిలో సూక్ష్మజీవులు పెరిగి, సేంద్రీయ పదార్థం వృద్ధి చెంది భూమి సారవంతమవుతుంది. రసాయన ఎరువులు, పురుగుమందుల మందుల వాడకాన్ని తగ్గించి సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారానే నేలను సారవంతంగా మార్చగలము.

**పంట మార్పిడి విధానాలు...**

పంటల మార్పిడి (క్రాప్ రొటేషన్) ద్వారా భూమిలో ఒకే రకమైన పంటను ఏళ్ల తరబడి సాగు చేయకుండా పంటల మార్పిడి ద్వారా వివిధ పంటలను సాగుచేయడం వలన నేలలో పోషక విలువలు పెరుగుతాయి, సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయి, నేల ద్వార సంక్రమించే రోగాలు, చీడ పీడల ప్రబావం తగ్గుతుంది అలాగె క్రాప్ హాలిడేస్ కూడా, భూసారం పునరుద్ధరణకు సహాయపడుతుంది..

**అటవీ ప్రాంతాలను పరిరక్షించడం...**

చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా భూసారం నిల్వ ఉంచవచ్చు,మట్టి క్షీణతను అడ్డుకోవడం ద్వారా పర్యావరణాన్ని రక్షించవచ్చు.

**నీటి సద్వినియోగం...**

డ్రిప్ ఇరిగేషన్, మైక్రో ఇరిగేషన్ ద్వారా నీటి వినియోగాన్ని సమతుల్యం చేయాలి, భూమిలో తేమను కాపాడేందుకు ముల్చింగ్ విధానం ఉపయోగించాలి.

**వ్యవసాయ విధానాలను పునరుద్ధరించాలి...**

ప్రభుత్వాలు,రైతు సంఘాలు, శాస్త్రవేత్తలు కలసికట్టుగా భూసార సంరక్షణ విధానాలు రూపొందించాలి. భూసార పరీక్షలపై రైతులకు అవగహన కల్పించి , అవసరమైన మోతాదులోనే ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా భూ సారన్ని కాపాడవచ్చు. పెరుగుతున్న జనాభాకు సరిపడ ఆహార ఉత్పత్తి జరగాలంటే వున్న భూమినే సారవంతంగా మార్చి వినియోగించాలి. మట్టిలో సూక్ష్మ జీవుల మనుగడ వుంటేనే భూమి సజీవంగా వుంటుందనే విషయాన్ని అందరూ గ్రహించి భూసారాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సారం లేని నిర్జీవమైన భూమి భవిష్యత్తు తరాల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తోంది. భూమి అనేది సమస్త కోటికి జీవనాధారం,కానీ భూమి నిస్సారం అవుతున్నా కొద్దీ మన భవిష్యత్తు ప్రమాదంలో పడుతోంది. భూమిలో సారం లేకపోతే ఆహారం లేదు, ఆరోగ్యం లేదు చివరికి జీవితమే లేదు. కాబట్టి, ఇప్పుడే అందరం భూసార సంరక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.. అన్నిటికీ జీవనాధారం భూమి, ఆరోగ్యకరమైన, సారవంతమైన భూమిని భావి తరాలకు అందిస్తేనే అందమైన, ఆరోగ్యకరమైన భారతాన్ని నిర్మించుకోగలగుతాం లేదంటే భవిష్యత్తు చాలా భయంకరంగా ఉంటుంది

**మట్టిలో జీవం వుంటేనే మనిషికి జీవితం ఉంటుంది**

'భూమిలో సారం ఉంటేనే సమస్త జీవరాశికి మనుగడ ఉంటుంది.

జి.అజయ్ కుమార్,
వ్యవసాయ నిపుణులు







# గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలి

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత**
**సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలి**
**ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికపై నూతన ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం**

**ఆసిఫాబాద్, మార్చి 12 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు భాగస్వాములై సమస్యలను గుర్తించి అక్కడిక్కడే పరిష్కరించాలని కలెక్టర్ కె.హరిత అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీపీవో భిక్షపతి, మున్సిపల్ చైర్మన్‌లు షాహీన్ సుల్తానా, మెంగ్రె ఆకాష్‌లతో కలిసి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99వ రోజుల కార్యక్రమంలో సర్పంచ్‌లు, కౌన్సిలర్లు భాగస్వాములు కావాలని తెలిపారు. సర్పంచ్‌లు, కౌన్సిలర్లు తమ పరిధిలోని ప్రతి శాఖకు అధిపతులను, తాము పొందిన పదవులు బాధ్యతాయుతమైనవని అన్నారు. తమ పరిధిలోని ప్రతి సమస్యను గుర్తించి అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే ని?ధులతో తమ పరిధిలోని పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. భూగర్భ నీటి మట్టాన్ని పెంచే విధంగా ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని, నీటి పొదుపు ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఏప్రిల్ 2న ప్రతి గ్రామ పంచాయతీ, వార్డులో గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. జూన్ 12 వరకు జరుగనున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, మహిళల ఆరోగ్యం, సురక్షిత ప్రయాణం, సంక్షేమ పథకాల అమలు, చిన్న పిల్లల భద్రత, మాదకద్రవ్యాల కట్టడి, రైతు సంక్షేమం, వ్యవసాయం, విద్య, పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, యువజన క్రీడలు, సేవలు, మహిళల సంక్షేమం, పర్యావరణ రక్షణ వంటి పది అంశాలపై ప్రణాళిక రూపొందించాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడా రు. సమావేశంలో జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారా వు, గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సీతారాం, మున్సి పల్ వైస్ చైర్మన్ అహ్మద్, అనిత తదితరులు పాల్గొన్నారు.




## బెల్లంపల్లిలో అన్నదాన కార్యక్రమం

**బెల్లంపల్లి, మార్చి 12 (ప్రభాత సమాచారం)** అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నిదానాలకంటే అన్న దానం గొప్పదని భావిస్తూ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో గురువారం బెల్లంపల్లి కాంట చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ ప్రాంతంలో అమ్మ ఒడి ఎన్‌జీఓ అన్నదాత ప్రాజెక్ట్, టెక్నో డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. అన్నమో రామచంద్ర అని అలమటించే ఎందరో ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టుతూ కార్యక్రమాన్ని నిర్వహించారు. గంప ఆరుణ--సత్యనారాయణ దంపతుల ఏకైక పుత్రిక స్నేహ వివాహం సాయిరాం తో మూడు ముళ్ల బంధంతో ఏడడుగులు నడిచి ఏకమవుతున్న సందర్భంగా యాచకులు, నిరుపేదలు, దినసరి అడ్డ కూలీలు, బాటసారులకు సుమారు 200 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అమ్మ ఒడి అన్నదాత ప్రాజెక్ట్ వ్యవస్థాపకులు అజ్మీరా మోహన్, మంచిర్యాల జిల్లా బ్రాంచ్ మేనేజర్, టెక్నో డాన్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ హనుమాండ్ల మధుకర్ మాట్లాడుతూ అమ్మ ఒడి అన్నదాత ప్రాజెక్ట్‌లో భాగంగా 370వ వారోత్సవ సందర్భంగా నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమం విజయవంతంగా సాగిందన్నారు. కార్యక్రమంలో అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల సువర్ణ, గన్నేవరం తిరుమల చారి, బియ్యాల ఉపేందర్, భావాని, మేడిపల్లి రమేష్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన రైతులు

**ముథోల్, మార్చి 12 (ప్రభాత సమాచారం)** కుంటాల మండలంలోని అంబకంటి గ్రామానికి 33/11 కివి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేసిన ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు గురువారం రైతులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ప్రవీణ్ ముత్యం రైతుల పాల్గొన్నారు.



# పెళ్లి వాహనం బోల్తా.. ఇద్దరు దుర్మరణం


**14 మందికి గాయాలు - నిర్మల్ జిల్లాలో ఘటన**



**నిర్మల్, మార్చి 12 (ప్రభాత సమాచారం)** నిర్మల్ మండలంలోని ఎల్లంపల్లి శివారులో హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం పెళ్లి వాహనం బోల్తా పడి, ఇద్దరు దుర్మరణం చెందారు. అదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం సోంపూర్ గ్రామానికి చెందిన 21 మంది మినీ వ్యాన్‌లో ఆర్మూర్‌కు పెళ్లి కోసం వెళ్తున్నారు. ఎల్లాపెల్లి వద్దకు రాగానే వాహనం ముందు టైరు పేలిపోవడంతో అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న భరోడే లక్ష్మణ్ (60), బోయినవాడు తులసి దాస్ (38) ఇద్దరు తీవ్రగాలయాలై అక్కడికక్కడే మృతి చెందా రు. బాలాజీ, లక్ష్మణ్ తోపాటు మరో ఇద్దరికి గాయాలు కాగా పది మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఎస్పీ జానకి ఘటన స్థలానికి వెళ్లి క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. విషమంగా ఉన్న ఇద్దరిని ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

**క్షతగాత్రులను పరామర్శించిన బోథ్ ఎమ్మెల్యే...**

సిరికొండ మండలం సోంపల్లి గ్రామస్తులు ప్రయాణిస్తున్న వాహనం నిర్మల్ జిల్లా కొండాపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, మరో 21 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారందరిని ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వెంటనే రిమ్స్ ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. వారికి నాణ్యమైన వైద్యం అందించాలని రిమ్స్ డైరెక్టర్ జేసింగ్ రాథోడ్‌ను ఆదేశించారు. అధైర్యపడవద్దని, అండగా ఉంటామని ఎమ్మెల్యే బాధితులకు భరోసా ఇచ్చారు.



# పాఠశాలలో కనీస సౌకర్యాలు కరువు





**జైనూర్, మార్చి 12 (ప్రభాత సమాచారం)** జైనూర్ మండలం జంగాం గ్రామం ఈ గ్రామంలో ఉర్దూ పాఠశాల ఉంది ఈ పాఠశాలలో మరుగుదొడ్లు సక్రమంగా లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. 2014 సంవత్సరంలో స్వచ్ఛభారత్ పథకం కింద మరుగుదొడ్డి నిర్మించినప్పటికీ మరమ్మ తులు నోచుకోక దుర్గంధం వెదజల్లుతున్నాయి. పాఠశాలలో నీటి సౌకర్యం లేక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఉన్న పాత మరుగుదొడ్లకు తలుపులు సక్రమంగా లేకపోవడంతో ఉపాధ్యాయులు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో ఒకరు ఉపాధ్యాయులతో పాటు ఒకటి నుంచి 5వ తరగతి వరకు 32మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మరుగుదొడ్లు లేక పాఠశాల పరిసర ప్రాంతాల ఇళ్లలోకి వెళ్లాల్సివస్తుంది. గత ప్రభుత్వంలో మన ఊరు మనబడి కార్యక్రమంలో ఈ పాఠశాల ఎంపికైనప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలకు సమీపంలో అంగన్వాడి కేంద్రం ఉన్నప్పటికీ కేంద్రానికి సైతం మరుగుదొడ్డి లేకపోవడంతో బాల బాలికలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తుంది. పశువులు పాఠశాల చుట్టూ తిరుగుతున్నాయి. పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించి నాగులవాయి పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించడంతోపాటు మరుగుదొడ్లను మరమ్మత్తులు చేపట్టివిద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రహరీ గోడ లేక పశువులతో ఇబ్బంది పాఠశాలకు ప్రహరీ గోడ సైతం లేకపోవడం వల్ల పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.

## బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా అశోక్ ముస్తాపూరే నియామకం

**ఆదిలాబాద్, మార్చి 12 (ప్రభాత సమాచారం)** బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అశోక్ ముస్తాపూరే ను నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకంపై అశోక్ ముస్తాపూరే తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ నియామకం ఆదిలాబాద్ జిల్లాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై విశ్వాసంతో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ విధేయుడిగా పని చేస్తానన్నారు.





## పవన్ డూప్‌గా హరీష్..?

దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న లేటెస్ట్ మూవీ ఉస్తాద్ భగత్ సింగ్ విడుదలకు సిద్ధమవుతోంది. పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న ఆ సినిమా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ సినిమా ప్రమోషన్ల వేగం పెంచిన దర్శకుడు వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన అనేక విషయాలను ఆయన వెల్లడిస్తున్నారు. తాజాగా గతంలో వచ్చిన కొన్ని రూమర్లపై స్పందించారు. సినిమా ప్రీ లుక్ పోస్టర్ విడుదలైన సమయంలో సోషల్ మీడియాలో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ఆ పోస్టర్ లో హీరోను వెనక నుంచి మాత్రమే చూపించారు. ఖాకీ డ్రెస్ లో కుర్చీలో కూర్చున్న వ్యక్తి ఫోటో ఉండటంతో, అందులో ఉన్నది నిజంగా పవనేనా? లేక హరీష్ శంకరే డూప్ గా నటించారా? అనే డౌట్స్ మొదలయ్యాయి. కొంతమంది అయితే అది పవన్ కాదని, హరీష్ నటించారని ఫిక్సయ్యారు. తర్వాత టీజర్ విడుదలైనప్పటికీ ఆ చర్చ ఆగలేదు. కొంతమంది ప్రేక్షకులు అదే అభిప్రాయం వ్యక్తం చేస్తూ, కొన్ని బ్యాక్ షాట్స్ లో హరీష్ శంకర్ కనిపించారని అనుకున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న హరీష్ స్పష్టతనిచ్చారు. ఆ రూమర్ల గురించి మాట్లాడిన ఆయన.. ఇప్పటివరకు తాను పవన్ కు డూప్ గా నటించలేదని స్పష్టం చేశారు. ప్రీ లుక్ పోస్టర్ వచ్చినప్పుడు సోషల్ మీడియాలో వచ్చిన కామెంట్లు చూసి బాధపడలేదని చెప్పారు. పవన్ తో తనను పోల్చడం ఆనందంగా అనిపించిందని తెలిపారు. స్టార్ హీరోలా ఉన్నాడని అనుకుంటే అది సంతోషమేనని అన్నారు. అలాగే ఇండస్ట్రీలో బాడీ డూప్స్ ఎందుకు ఉపయోగిస్తారనే విషయంపై వివరించారు. షూటింగ్ సమయంలో హీరోలు చాలా సార్లు ప్రమాదకరమైన సన్నివేశాల్లో నటించాల్సి వస్తుందని చెప్పారు. అలాంటి సందర్భాల్లో చిన్న గాయం అయినా షూటింగ్ షెడ్యూల్ మొత్తం మారిపోతుందని తెలిపారు.దీనివల్ల నిర్మాతలకు భారీ ఆర్థిక నష్టం కలగవచ్చని అన్నారు. అందుకే ముఖ్యంగా రిస్క్ ఎక్కువగా ఉండే యాక్షన్ సన్నివేశాల్లో బాడీ డూప్స్‌ను ఉపయోగించడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఇది హీరోల భద్రత కోసం కూడా అవసరమని, నిర్మాతలు అదే దృష్టితో నిర్ణయం తీసుకుంటారని వివరించారు. మొత్తానికి.. పవన్ డూప్ గా హరీష్ శంకర్ నటించారన్న విషయంపై ఇప్పుడు క్లారిటీ వచ్చినట్లైంది.



## రెండేళ్లకే ముగిసిన హన్సిక వివాహం

'దేశముదురు' సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులకు దగ్గరైన హన్సిక మోత్వాని, ఆ తర్వాత తెలుగులో చాలామంది స్టార్ హీరోలతో నటించి స్టార్ హీరోయిన్ అయిపోయింది. ఆ తర్వాత కాలంలో బాలీవుడ్ కి వెళ్ళిన ఆమె, పూర్తిగా తెలుగు సినీ పరిశ్రమకు దూరమైంది. అయితే, ఆమె ఇటీవల విడాకులు తీసుకున్నట్లు తెలియడంతో మరోసారి వార్తల్లోకి వచ్చింది. వాస్తవానికి హన్సిక ప్రేమ వివాహం చేసుకుంది. అయితే, ఆ ప్రేమ వివాహం కూడా అంత ఈజీగా ఏమీ జరగలేదు. ఆమె ఇదివరకే విడాకులు తీసుకున్న వ్యక్తిని వివాహం చేసుకుంది. ఆమె భర్త పేరు సోహైల్ కాగా, అతను గతంలో హన్సిక ప్రాణ స్నేహితురాలినే పెళ్లి చేసుకుని విడాకులు తీసుకున్నాడు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, వారి వివాహానికి హన్సిక హాజరై దగ్గరుండి ఆ వివాహాన్ని జరిపించింది.వాళ్లు విడాకులు తీసుకున్న తర్వాత, హన్సిక సదరు వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకుంది. 2022లో వీరి వివాహం జరిగింది. అయితే, పెళ్లి అయిన రెండేళ్లకే వీరి మధ్య వివాదాలు తలెత్తడంతో విడిపోయారు. అప్పటినుంచి విడివిడిగానే ఉంటున్నారు. తాజాగా వీరు విడాకులకు అప్లై చేసి, కోర్టు ద్వారా అధికారికంగా విడిపోయారు. వాస్తవానికి హన్సిక వివాహం చేసుకుంటున్నట్లు ప్రకటించినప్పుడు, ఆమె మీద సోషల్ మీడియాలో విపరీతమైన నెగెటివిటీ వచ్చింది. దాన్ని తట్టుకుని మరీ హన్సిక ముందుకు వెళ్ళింది, కానీ వారి వివాహ బంధం మాత్రం ఎక్కువ రోజులు నిలబడలేకపోయింది.



## శంకర్ ఫోటో ఎక్కడ?

ఇండియన్ సినిమా దగ్గర ఉన్నటువంటి లెజెండరీ దర్శకులు లిస్ట్ తీస్తే అందులో ఇప్పుడు ఎంత ఫామ్ లో లేకపోయినా తప్పకుండా ఉండే పేరు శంకర్. తాను కోలీవుడ్ దర్శకుడు అయినప్పటికీ ఇండియన్ సినిమాని హాలీవుడ్ స్టాండర్డ్స్ లో ఎప్పుడో చూపించారు. ఇదిలా ఉంటే తాజాగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నూతనంగా ఆరంభిస్తున్న మల్టిప్లెక్స్ నుంచి విజువల్స్ కొన్ని సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.అయితే ఇందులో ఒక దగ్గర ఇండియన్ సినిమా ప్రైడ్ దర్శకుల లిస్ట్ ఫ్రేమ్స్ ఉన్నాయి. ఇందులో దాదాపు అందరు ప్రముఖ దర్శకులు తెలుగు, తమిళ్, హిందీ ఇతర భాషల నుంచి కూడా పెట్టారు. కానీ ఈ లిస్ట్ లో దర్శకుడు శంకర్ ఫ్రేమ్ మాత్రం ఎక్కడా కనిపించలేదు. దీనితో ఆ విజువల్స్ చూసిన నెటిజన్స్ ఖచ్చితంగా ఈ లిస్ట్ లో శంకర్ లేకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.భారతీయ సినిమా దగ్గర శంకర్ అందించిన సినిమాలు తీసుకొచ్చిన టెక్నాలజీల కోసం ఎంత చెప్పకున్నా తక్కువే అవుతుంది. ఇప్పుడు ఇండియాస్ నెంబర్ 1 దర్శకుడు ఎస్ ఎస్ రాజమౌళినే శంకర్ తమకి ఓజి దర్శకుడు అని కొనియాడారు. అలాంటి దర్శకుడి ఫోటోని మిస్ చేయడం అనేది సబబు కాదు. మరి దీనిని వారు కరెక్ట్ చేసుకుంటారో లేదో చూడాలి.

# సిలిం'డర్'..!

■ వాణిజ్య సిలిండర్ల సరఫరా నిలిపివేయడంతో హోటళ్లలో కష్టాలు ■ కట్టెల పొయ్యిలపై పరిమిత వంటకాలు.. కొన్నిచోట్ల మూసివేత
■ చాయ్ డబ్బాలకూ తప్పని తిప్పలు..స్టాక్ లేకపోవడంతో ఇక్కట్లు ■ బ్లాక్‌లో సబ్సిడీ సిలిండర్లు.. తనిఖీలు చేయని అధికారులు
■ బుకింగ్ వ్యవస్థ నిలిపివేత.. గతంలో కంటే డెలివరీ ఆలస్యం
■ కొన్ని ఏజెన్సీల పరిధిలో అర్జంటుగా కావాలంటే అదనంగా వసూళ్లు

■ ప్రభాత సమాచారం, ఆదిలాబాద్ ప్రతినిధి

'ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చింది' అన్నది ఒక సామెత.. ప్రస్తుత పరిస్థితికి ఈ సామెత సరిగ్గా సరిపోతుందని చెప్పవచ్చు. అమెరికా- ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావం సామాన్యులపై పడటం మెల్లిమెల్లిగా మొదలైంది. నిత్య జీవితంలో అత్యంత కీలకమైన పెట్రోల్, డీజిల్, గ్యాస్‌లలో సింహభాగం హర్మూజ్ జలసంధి నుంచే రావాల్సి ఉండగా.. అక్కడ నెలకొన్న పరిస్థితులతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ కొరత లేకపోయినప్పటికీ, గ్యాస్ కొరత ఏర్పడకుండా ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వాణిజ్య సిలిండర్ల సరఫరాను ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ ధరను కూడా రూ.60 పెంచింది. ఇప్పటికిప్పుడు గృహ అవసరాలకు గ్యాస్ కొరత లేదు కానీ, వాణిజ్య సిలిండర్లు, బ్లాక్ సబ్సిడీ సిలిండర్లు ఉపయోగించే హోటళ్లపై భారీ ప్రభావం పడింది. గతంలో భారీ వంటకాలకు కట్టెల పొయ్యిల బట్టీలనే వినియోగించేవారు. కానీ కాలక్రమంలో గ్యాస్ విరివిగా దొరకడం, అన్ లిమిటెడ్ డిషెష్ అందుబాటులోకి రావడంతో గ్యాస్ వినియోగం తప్పనిసరి అయ్యింది. ఇప్పుడు గ్యాస్‌పై ఆధారపడటం హోటళ్ల నిర్వాహకులకు శాపంగా మారిందని చెప్పవచ్చు. వాణిజ్య సిలిండర్ బుకింగ్‌ను నిలిపివేయడంతో వంటలు ఎలా చేయాలో తెలియని పరిస్థితులు ఉమ్మడి జిల్లాలో నెలకొన్నాయి. గ్యాస్ కొరతతో హైదరాబాద్‌లో ఇప్పటికే సోమవారం రెస్టారెంట్లకు సెలవు ప్రకటించారు.




'ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చింది' అన్నది ఒక సామెత.. ప్రస్తుత పరిస్థితికి ఈ సామెత సరిగ్గా సరిపోతుందని చెప్పవచ్చు. అమెరికా- ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావం సామాన్యులపై పడటం మెల్లిమెల్లిగా మొదలైంది. నిత్య జీవితంలో అత్యంత కీలకమైన పెట్రోల్, డీజిల్, గ్యాస్‌లలో సింహభాగం హర్మూజ్ జలసంధి నుంచే రావాల్సి ఉండగా.. అక్కడ నెలకొన్న పరిస్థితులతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ కొరత లేకపోయినప్పటికీ, గ్యాస్ కొరత ఏర్పడకుండా ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వాణిజ్య సిలిండర్ల సరఫరాను ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ ధరను కూడా రూ.60 పెంచింది. ఇప్పటికిప్పుడు గృహ అవసరాలకు గ్యాస్ కొరత లేదు కానీ, వాణిజ్య సిలిండర్లు, బ్లాక్ సబ్సిడీ సిలిండర్లు ఉపయోగించే హోటళ్లపై భారీ ప్రభావం పడింది. గతంలో భారీ వంట కాలకు కట్టెల పొయ్యిల బట్టీలనే వినియోగించేవారు. కానీ కాలక్రమంలో గ్యాస్ విరివిగా దొరకడం, అన్ లిమిటెడ్ డిషెష్ అందుబాటులోకి రావడంతో గ్యాస్ వినియోగం తప్పనిసరి అయ్యింది. ఇప్పుడు గ్యాస్‌పై ఆధారపడటం హోటళ్ల నిర్వాహకులకు శాపంగా మారిందని చెప్పవచ్చు. ఇప్పుడు వాణిజ్య సిలిండర్ బుకింగ్‌ను పూర్తిగా నిలిపివేయడంతో వంటలు ఎలా చేయాలో తెలియని పరిస్థితులు ఉమ్మడి జిల్లాలో నెలకొన్నాయి. గ్యాస్ కొరతతో హైదరాబాద్ మహానగరంలో ఇప్పటికే సోమవారం రెస్టారెంట్లకు సెలవు ప్రకటించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉమ్మడి జిల్లాలో హోటళ్లను మూసివేయడం లేదా సెలవులు ప్రకటించడం తథ్యమనే అభిప్రాయం నెలకొంది. ఇప్పటికే కొన్ని టిఫిన్ సెంటర్లు మూతపడగా.. చాయి డబ్బాలు కూడా నడవడం లేదు. ప్రముఖ హోటల్‌లో కూడా గ్యాస్‌కు బదులు కట్టెల పొయ్యిలను ఏర్పాటు చేసుకున్నారు. రెగ్యులర్ డిషెష్ కాకుండా కేవలం బిర్యానీ, వైట్‌రైస్, కర్రీస్‌కు పరిమితమవుతున్నారు. మిగతా హోటళ్లలో కూడా లిమిటెడ్ డిషెష్ చేస్తున్నారు. మాటిమాటికీ గ్యాస్ వినియోగించే వంటల జోలికి పోకూడదని నిర్ణయించుకున్నట్లు హోటళ్ల యజమానులు తెలుపుతున్నారు.

**పనిచేయని బుకింగ్ వ్యవస్థ...**

ప్రభుత్వం అధికారికంగా వాణిజ్య సిలిండర్ సరఫరాను మాత్రమే నిలిపివేసింది. యుద్ధం ఇలాగే కొనసాగితే గృహ అవసరాలు తీర్చేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. కానీ బుకింగ్ వ్యవస్థ అటు వాణిజ్య సిలిండర్‌కు.. ఇటు గృహ వినియోగ సబ్సిడీ సిలిండర్‌కు పనిచేయడం లేదు. గతంలో ప్రతీ వినియోగదారుడు ఆయా పంపిణీ సంస్థ ఇచ్చిన టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే.. రింగ్ అయి కట్ అయిన తర్వాత బుక్ అయినట్లు మెసేజ్ వచ్చేది.. ఒక్క రోజులోనే డెలివరీ కూడా అయ్యేది. కానీ ఇప్పుడు ఆ నెంబర్‌కు ఫోన్ చేస్తే పనిచేయడం లేదు. 'దిస్ నెంబర్ డస్ నాట్ అవైలబుల్' అని వస్తోంది. దీంతో నేరుగా ఏజెన్సీలకు వెళ్లి వినియోగదారులు భయాందోళనతో ఎక్కువ బుకింగ్స్ చేస్తున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. అలాగే బుక్ చేసిన అయిదు రోజులకు సిలిండర్ డెలవరీ అవుతోంది. గతంలో బుకింగ్ గ్యాప్ 21 రోజులు ఉండగా.. ప్రస్తుతం 30 రోజులకు పెంచారు. అయినా ఒత్తిడి భారీగా ఉంది. ఆందోళనతో ఏజెన్సీల చుట్టూ ప్రజలు తిరుగుతున్నారు. గతంలో బ్లాక్‌లో సబ్సిడీ సిలిండర్లు తీసుకునే హోటళ్ల నిర్వాహకులు కూడా ఇప్పుడు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే సబ్సిడీ సిలిండర్లను బ్లాక్‌లో కొనుగోలు చేసి హోటళ్లను నిర్వహిస్తున్నారు. గృహ వినియోగ గ్యాస్ దుర్వినియోగ కట్టడికి హైదరాబాద్‌లో తనిఖీలు చేస్తుండగా.. ఉమ్మడి జిల్లాలో పెద్దగా కనిపించడం లేదు. చాలాచోట్ల కేవలం అధికారులు ప్రకటనలకే పరిమితమవుతున్నారు. అలాగే ఇప్పటికే సిలిండర్‌పై ధర రూ.60 పెరగ్గా.. తొందరగా సిలిండర్ కావాలంటే పలు ఏజెన్సీల్లో అదనంగా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. అలాగే డెలవరీ బాయ్స్ కూడా తొందరగా సిలిండర్ కావాలంటే అదనపు మొత్తం తీసుకుంటున్న పరిస్థితి నెలకొన్నది. ఉమ్మడి జిల్లాలో మొత్తం ఉజ్వల, దీపం పథకాలతో కలిపి గృహ వినియోగ సిలిండర్ కనెక్షన్లు ఉన్నాయి. భారత్, ఇండియన్, హెచ్‌పీ గ్యాస్ వంటి పంపిణీ సంస్థలు నిత్యం సరఫరాను చేస్తున్నాయి. వీటితో పాటు వేల సంఖ్యలో కమర్షియల్ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఎక్కువ హోటళ్లలో సబ్సిడీ సిలిండర్లనే వినియోగిస్తున్నందున కమర్షియల్ గ్యాస్ కనెక్షన్లను తీసుకోలేదు. మెజారిటీ డబుల్ సిలిండర్ కనెక్షన్లు ఉన్నాయి. డబుల్ సిలిండర్ కనెక్షన్ల వారు ఎప్పుడూ ఒక నిండు సిలిండర్‌ను అదనంగా ఉంచుకుంటారు కాబట్టి వారికి ప్రస్తుతం ఎలాంటి ఆందోళన లేదు. కానీ సింగిల్ సిలిండర్ వినియోగదారులు మాత్రం చాలా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా దీపం, ఉజ్వల వంటి పథకాల లబ్ధిదారులకు సింగిల్ సిలిండర్ మాత్రమే ఉంటుంది. ఈ నేపథ్యంలో బుకింగ్ నెంబర్ పనిచేయకపోవడంతో ఆందోళన చెంది.. వారి ఏజెన్సీల వద్దకు పరుగులు తీస్తున్నారు. డెలవరీ చేస్తామని చెబుతున్నా.. తామే తీసుకెళ్తామని పట్టుబడుతున్నారు. కొన్ని మండలాల్లో డబుల్ ఏజెన్సీలు ఉండగా.. కొన్నింటిలో సింగిల్ ఏజెన్సీలే ఉన్నాయి. అలాంటి చోట్ల వినియోగదారులకు ఎక్కువ ఇబ్బంది అవుతోంది. ఆందోళన పెరగకుండా గ్యాస్ లభ్యతను ప్రకటించి.. బుకింగ్ నెంబర్ యథావిధిగా పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## ఈనెల 16 నుంచి ఒంటి పూట బడి

### ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు

**ముథోల్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర వ్యాప్తంగా ఎండల తీవ్రత రోజు రోజుకూ పెరుగుతోంది. ఉదయం 10 గంటలకే భానుడు భగభగ మండుతున్నాడు. ఎండ తీవ్రతకు బయటకు రావడానికి ప్రజలు జంకుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఈనెల 16 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభించాలని ఆదేశాలు జారీచేసింది. 'పది' పరీక్ష కేంద్రం ఉన్న పాఠశాలల్లో.. ఈ నెల 14 నుంది పదో తంగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పదో తరగతి పరీక్ష కేంద్రం ఉన్న పాఠశాలల్లో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 గంటకు విద్యార్థులు రాగానే భోజనం పెట్టి అనంతరం తరగతులు నిర్వహిస్తారు. తెలంగాణ ప్రభుత్వం సూచనల మేరకు రాష్ట్ర పాఠశాల డైరెక్టర్ నవీన్ నికోలస్ ఒంటి పూట బడులకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ మేనేజ్మెంట్ పాఠశాలలకు ఈ



ఆదేశాలు వర్తిస్తాయని తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. 12.30 గంటలకు మధ్యాహ్న భోజనం పెట్టి విద్యార్థులను ఇంటికి పంపిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుంచి జిల్లాలో ఒంటి పూట బడులు ప్రారంభించాలని ఎంఈవోలకు ఆదేశాలు జారీ చేశామని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు యాజమాన్య పాఠశాలలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు తరగతులు నిర్వహించాలి. పదో తరగతి పరీక్ష కేంద్రం ఉన్న పాఠశాలల్లో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు కొనసాగుతాయని డీఈవో భోజన్న తెలిపారు.

## ఆర్జీయూకేటీలో మాక్ డ్రిల్

**ముథోల్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

బాసరలోని ఆర్జీయూకేటీలో పదో బెటాలి యన్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఆధ్వర్యంలో గురు వారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాన్ని ఎలా తగ్గించాలో విద్యార్థులకు అవగాహన కల్పించ డమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది. కమాండర్ మన్మోహన్ యాదవ్ ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. తన బృందంతో కలిసి వివిధ రకాల ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పుడు అనుసరించాల్సిన రక్షణ పద్ధతులను ప్రత్యక్షంగా చేసి చూపారు. ఆపద సమయంలో తక్షణమే స్పందించే తీరు. ప్రథమ చికిత్స అందించే విధానం. అందుబాటులో ఉన్న వనరులతో ప్రాణాలను కాపాడు కోవడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతోపాటు విపత్తు నిర్వహణ నైపుణ్యాలను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు డాక్టర్ ఎస్.విఠల్, శేఖర్, బి.శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.








# 99 రోజుల ప్రణాళికతో జిల్లా ప్రగతికి సరికొత్త బాట

**ఆదిలాబాద్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" లో భాగంగా 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ గార్డెన్ లో ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సర్పంచ్లు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల శిక్షణ కార్యక్రమంలో ఆదిలాబాదు, బోథ్ ఎమ్మెల్యేలు పాయల శంకర్, అనిల్ జాదవ్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి ప్రసంగించారు. ముందుగా జిల్లాలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వైద్యారోగ్య శాఖ, వ్యవసాయ శాఖ (రైతు భరోసా, రుణమాఫీ), విద్యాశాఖ (అమ్మ ఆదర్శ పాఠశాల), ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ద్వారా చేపడుతున్న కార్యకలాపాలు, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా కార్యక్రమం, అటవీ శాఖ ద్వారా పర్యావరణ పరిరక్షణపై సంబంధిత, ఇతర శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. జిల్లాలో "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని, ఈ ప్రత్యేక కార్యక్రమం మార్చి 6న ప్రారంభమై జూన్ 12 వరకు కొనసాగుతుందని అన్నారు. జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని, గ్రామ, వార్డు స్థాయిలో పండుగ వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామాల్లో గ్రామ సభలు, వార్డుల్లో వార్డు సభలు నిర్వహించి, అభివృద్ధి పనులపై సమీక్ష జరపాలని ఆదేశించారు. ప్రణాళికలో భాగంగా మార్చి 6 నుండి 15 వరకు పరిశుభ్రతలో భాగంగా గ్రామాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య పనులు, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్. ఏప్రిల్ 6 నుండి 11 వరకు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్. మే 4 నుండి 9 వరకు రైతు సంక్షేమంలో భాగంగా వ్యవసాయం, రెవెన్యూ, నీటి పారుదల శాఖల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమం, ఇందిరమ్మ ఇళ్లు, ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి, పిల్లల రక్షణ 'డ్రగ్స్ కు నో' ప్రచారం, విద్య, యువత-క్రీడలు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటివి అమలు చేయడం జరుగుతుందని వివరించారు. కొత్తగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్లకు ఇది మొదటి శిక్షణ అని, సర్పంచులు, కౌన్సిలర్లు సమన్వయంతో పని చేసి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. ఆదిలాబాదు శాసన సభ్యులు పాయల శంకర్ మాట్లాడుతూ, సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడంలో సర్పంచ్‌లు, కౌన్సిలర్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. బోథ్ శాసన సభ్యులు అనిల్ జాదవ్ మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, మనం చేసిన పనుల ఆధారంగానే ప్రజలు భవిష్యత్తులో మనల్ని ఎన్నుకుంటారని తెలిపారు. అనంతరం రైతులకు ఉచితంగా అందించేందుకు 500 రూపాయల విలువగల ఐదురకాల కూరగాయల విత్తనాల కిట్‌ను కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, డిఆర్డీఓ రవీందర్, డిపిఓ రమేష్, అదనపు ఎస్పీలు సురేందర్ రావు, మౌనిక, మున్సిపల్ వైస్ చైర్మన్ రోహిత్, జిల్లా ఉద్యానవన అధికారి నర్సయ్య, మున్సిపల్ కమిషనర్ రాజు, సర్పంచ్‌లు, మున్సిపల్ వార్డుల కౌన్సిలర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- ఆదిలాబాద్ రెవెన్యూ గార్డెన్‌లో సర్పంచులు, కౌన్సిలర్లకు శిక్షణ సదస్సు
- హాజరైన ఎమ్మెల్యేలు పాయల శంకర్, అనిల్ జాదవ్
- మార్చి 6 నుంచి జూన్ 12 వరకు కార్యాచరణ
- ఏప్రిల్ 2న గ్రామ, వార్డు సభల నిర్వహణకు ఆదేశం
- పారిశుధ్యం నుంచి మహిళా సాధికారత వరకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకు సాగాలి..






## బీసీ సంక్షేమానికి రూ.50 వేల కోట్లు కేటాయించాలి

**మంచిర్యాల, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

బీసీల సంక్షేమానికి ప్రభుత్వం 50వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ గురువారం జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు సిసిసి కార్నర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లాకార్డ్స్ తో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో మేము అధికారంలోకి వస్తే ఐదు సంవత్సరాలలో బీసీల సంక్షేమానికి లక్ష కోట్లు బడ్జెట్ ప్రవేశపెడతామని ఇచ్చిన మేనిఫెస్టో ఉత్త అబద్ధమన్నారు. అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న ప్పటికీ మొదటి బడ్జెట్ సమావేశాలలో రూ.9 వేల కోట్లు, రెండో బడ్జెట్ సమావేశాల లో రూ.11 వేల కోట్లు మాత్రమే బడ్జెట్ ప్రవేశ పెట్టడం అంటే పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలు విస్మరించినట్లే అని అన్నారు. ప్రతి బడ్జెట్ సమావేశాల్లో రూ.20వేల కోట్లు చొప్పున బడ్జెట్ ప్రవేశపెడితే 5 సంవత్సరాలలో కలిపి లక్ష కోట్ల బడ్జెట్ అవుతుందన్నారు. ప్రతి బడ్జెట్ సమావేశాల్లో అరకోర నిధులు విడుదల చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తుందన్నారు. రాష్ట్ర జనాభాలో 56 శాతం బీసీ జనాభా ఉంటే అరకురా నిధులు విడుదల చేయడం బీసీలకు అన్యాయం చేసినట్లేనని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధిక పన్నులు కట్టేది బిసి సమాజమేనని బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం బీసీలను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రూ.50వేలకోట్ల బడ్జెట్ కేటాయించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

### మూడు ఇళ్లు దగ్ధం - ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్




**నేరడిగొండ, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

నేరడిగొండ మండలం బోరిగాం గ్రామంలో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో మూడు నివాస గృహాలు, రెండు పశువుల కొట్టాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇళ్లలో ఉన్న నిత్యావసర వస్తువులు, నగదు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. మంటలను ఆర్పేందుకు గ్రామస్థులు ప్రయత్నించినప్పటికీ అప్పటికే పూర్తిగా కాలిపోయాయి. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఆదుకోవాలని అధికారులను బాధితులు కోరారు.

**ధైర్యంగా ఉండండి అండగా ఉంటా: బోథ్ ఎమ్మెల్యే**

నేరడిగొండ మండలంలోని బొరిగామ గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాద స్థలాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీ లించారు. ప్రమాదంలో నాలుగు ఇళ్లు, మూడు పశువుల పాకలు కాలిపోవడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ఇళ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ త్వరలోనే కొత్త ఇళ్లు మంజూరు చేస్తామని, ప్రభుత్వం తరపున న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. జాదవ్ ప్రేమ్సింగ్ అనే బాధితుడికి రూ.30వేల సహాయం అందించి, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.



## ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

**ఆదిలాబాద్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**

జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి గ్రామపంచాయతీ పరిధిలోని సిరికొండ గ్రామంలో చేపట్టిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ముగిసాయి. గురువారం ఫైనల్ మ్యాచ్‌ను గురువారం నిర్వహించారు. ఈ మేరకు తుదిపోరులో విజేతలుగా నిలిచిన జట్లకు కార్యక్రమ అతిథులు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గండ్రత్ రమేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ వైస్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, అప్కమ్ గంగయ్య, మాజీ డిసిసిబి డైరెక్టర్ మేస్రం పరమేశ్వర్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఇజ్జగిరి నారాయణ, ఎంపీటీసీ కనక రమణ, కిరణ్ చంటిబాపు, ఎర్రం నర్సింగ రావు, వినోద్ సిరికొండ గ్రామ పటేల్ తదితరులు పాల్గొన్నారు.మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న సహకారంతో గెలుపొందిన జట్లకు నగదు బహుమతి అందజేశారు. మూడు స్థానాల్లో నిలిచిన రూప్సింగ్ తండా, తంతోలి, లోకారి, సాలెగూడా జట్లకు రూ.20వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున బహుమతులను అందజేశారు.

# వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

## ఐటీడీఏ పీవో యువరాజ్ మార్మాట్ - విద్యార్థులకు పాఠాలు బోధించిన పీవో



**నార్నూర్ మార్చి 12 (ప్రభాత సమాచారం)**
గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత విద్యార్థులకు మెరుగైన విద్య నందించాలని ఐటీడీఏ పీవో యువరాజ్ మార్మాట్ ఉపాధ్యాయులకు ఆదేశించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం జామ డ, మార్కాపూర్ దిశ మోడల్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనం పై వార్డెన్, ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఐటీడీఏ ఇన్ చార్జ్ పీఓ యువరాజ్ మర్మట్ ఉపాధ్యాయునిగా మారారు. విద్యార్థులను పాఠాలను బోధించారు. విద్యార్థికి ప్రశ్నలు వేసి సమాధానాలను అడిగి తెలుసుకున్నారు. ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ యువరాజ్ మర్మట్ గురువారం నార్నూర్ మండలంలోని ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించారు. భోజన వివరాలను స్వయంగా పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులతో విద్యపై ఆరా తీశారు. ఉపాధ్యాయునిగా మారి పాఠాలను బోధించి ప్రశ్నలు వేసి సమాధానాలను రాబట్టారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన విద్య, అర్థమయ్యే రీతిలో భోదించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని, దోమల వల్ల వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాల్లో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.



ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

# బాసర ట్రిపుల్ ఐటీలో 'అడ్మిషన్ల' దందా?

## అవినీతిపై ఏసీబీ, ఈడీ విచారణ జరపాలి - ఏబీవీపీ డిమాండ్



**ముథోల్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో బాసర ట్రిపుల్ ఐటీ లో జరుగు తున్న అవినీతి మరియు అక్రమ అడ్మిషన్లపై ట్రిబుల్ ఐటీ ఓ ఎస్ డి డాక్టర్ మురళి కు వినతిపత్రం అందజేశారు. 2018 నుంచి 2024 వరకు పనిచేసిన కొందరు అధికారులు వందల కోట్ల రూపాయలు ఉపసంహరించుకొని అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై ఏసీబీ ద్వారా విచారణ జరిపించాలని, అలాగే తీవ్ర ఆర్థిక నేరాల నేపథ్యంలో ఈడి ద్వారా దర్యాప్తు కూడా చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ట్రిపుల్ ఐటీ బాసరలో గ్లోబల్ సీట్ల పేరుతో అక్రమ అడ్మిషన్ దందా కొనసాగుతోందని, బ్రోకర్లు మరియు కొందరు ఉద్యోగులతో కలిసి విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపిం చారు. ఈ నేపథ్యంలో గ్లోబల్ సీట్లను రద్దు చేసి జనరల్ మెరిట్ సీట్లను పెంచాలని ఏబీవీపీ కోరింది. ఈ కార్యక్ర మంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు కుంట హర్ష వర్ధన్, స్టేట్ హాస్టల్స్ కో-కన్వీనర్ గంగా ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివ, విగ్నేష్, అక్షయ్, మోహన్ మనీ, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## అడవులు, వన్య ప్రాణాలు సంరక్షణలో

# మీడియా పాత్ర కీలకం

## ఆసిఫాబాద్ డిఎఫ్ఓ నీరజ్ కుమార్ టెబ్రివాల్

**బెజ్జూర్, మార్చి 12 (ప్రభాత సమాచారం)**
అడవులు, వన్య సంరక్షణలో మీడియా పాత్ర కీలకమని కొమురం భీం ఆసిఫాబాద్ డిఎఫ్ఓ నీరజ్ కుమార్ టెబ్రివాల్ అన్నారు. గురువారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ రేంజ్ పరిధిలోని మాకిడి సెక్షన్లో అడవులు వన్య ప్రాణుల సంరక్షణ పై మీడియా పాత్ర వర్క్ షాప్‌లో ఆసిఫాబాద్ డిఎఫ్ ఓ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సిర్పూర్ రేంజ్ పరిధిలోని ఇటిక్యాల పహాడ్‌లో వెయ్యి ఎకరాల్లో ప్లాంటేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రాణహిత నది పరిసర ప్రాంతం కావడంతో పులుల ఆవాస ప్రాంతంగా ఇటిక్యాల పహాడ్ ఉందన్నారు. మహారాష్ట్ర నుంచి అడోభ అటవీప్రాంతం నుంచి పులులు ఇటిక్యాల పహాడ్ వస్తున్నట్లు తెలిపారు. అడవుల, రక్షణకు అభివృద్ధికి అటవీ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఎఫ్‌డిఓ అప్పయ్య మాట్లాడారు. పులుల ఆవాస కేంద్రంగాఇటిక్యాల పహాడ్ ఉందని, అడవుల సంపదను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కాగజ్‌నగర్ డివిజన్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు జరిగినట్లు తెలిపారు. అటవీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్, ట్రైన్ ఐఎఫ్ఎస్ ఆఫీసర్ ఆఫీసర్ భార్గవ్, బెజ్జూర్ రేంజ్ అధికారి ముసవీర్, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్ కుమార్, మాకేడి సెక్షన్ అధికారి మోహన్‌రావు, కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని రేంజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# పల్లె ప్రకృతి వనాలపై పట్టింపు ఏదీ?

**వాంకిడి, మార్చి 12 (ప్రభాత సమాచారం)**
గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం, ఆహ్లాదకర వాతావరణం కోసం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు సరైన నిర్వహణ లేక నిరాదరణకు గురవుతున్నాయి. మండలంలోని గణేష్పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం ప్రస్తుతం అధ్వానంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2020లో ఉపాధి హామీ నిధులతో ఈ వనా న్ని ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలను నాటారు. అయితే ప్రస్తుతం వాటిలో కొన్ని మాత్రమే పెరిగి పెద్దవిగా మారగా, మరికొన్ని మొక్కలు ఎండిపోతున్నాయని గ్రామ స్తులు చెబుతున్నారు. ముఖ్యంగా నీటి సదుపాయం లేకపోవడం వల్ల మొక్కలు నిలువ లేకపోతున్నాయని ఆరోపిస్తున్నారు. అదేవిధంగా ప్రకృతి వనం పిచ్చి మొక్కలు, పొదలతో నిండిపోవడంతో వనం ఆకృతిని కోల్పోయి నిరుపయోగంగా మారుతోందని తెలిపారు. మండలంలోని 28 గ్రామపంచాయతీల్లో గతంలో గులాబీ, మందారం, మల్లె, చాగంటి వంటి పూల మొక్కలతో పా టు మామిడి, సపోటా, జామ, దానిమ్మ వం టి పండ్ల మొక్కలను నాటారు. అయితే సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఈ వనాలు క్ర మంగా పాడైపోతున్నాయని స్థానికులు అం టున్నారు. హరిత నిలయాలుగా ఉండాల్సిన ఈ వనాలు నిర్లక్ష్యంతో పొందరిల్లులుగా మారుతున్నాయని ఇకనైనా సర్పంచులు, గ్రామ కార్యదర్శులు పల్లె ప్రకృతి వనాల సంరక్షణపై శ్రద్ధ చూపి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



విలేకరులు
కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY